ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
గురువారం 8 ఫిబ్రవరి 2024



నేటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ


నెల్లూరు (లీగల్) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ -2022కి రద్దు చేయాలని కోరుతూ గురువారం నుంచి 16వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర రెడ్డి, సుందరయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించి నట్లు వారు తెలిపారు. ఈ ఆందోళనకు న్యాయాధికారులు, న్యాయవాదులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

టచ్‌లో ఎవరున్నారు..

వారి కదలికలేంటి!?

- గ్రామస్థాయిలో టీడీపీ నాయకులపై నిఘా
- ఇంటెలిజెన్స్‌ను కాదని పోలీసులకు ఆదేశం
- సొంత పార్టీ అసంతృప్తి నేతలపైనా ఆరా
- రహస్య నివేదిక ఇవ్వాలని సూచనలు
- వలంటీర్లకూ అదనపు జీతాల ఎర

తెలుగుదేశం అభ్యర్థులు.. ఆశావహుల కదలికలపై వైసీపీ దృష్టి సారించింది. అందుకోసం ఎన్నడూ లేనివిధంగా ఇంటెలిజెన్స్ శాఖకు సమాంతరంగా పోలీసులను రంగంలోకి దించింది. టీడీపీ అభ్యర్థులు, ఆశావహులు, ముఖ్య నాయకుల వ్యక్తిగత పరిచయాలు, రహస్య భేటీలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసు శాఖకు రహస్య ఆదేశాలు అందినట్లు తెలిసింది.



నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో గెలవాలంటే ప్రత్యర్థి బలాలు, బలహీనతలు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. వైసీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఆ యుద్ధ నీతినే అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుల కదిలికలపై నిఘా ఉంచడంతో పాటు మండలాల పరిధిలో ముఖ్యమైన నాయకులు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారో ఎప్పటికప్పుడు తెలుసుకునే బాధ్యతను పోలీసు శాఖకు అప్పగించినట్లు తెలిసింది. తెలుగుదేశం అభ్యర్థికి మండల, గ్రామాల స్థాయిలో బలంగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను గుర్తించి వారిని నయానో, భయానో లొంగదీసుకునేందుకు పోలీసు శాఖను వినియోగించుకొంటోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులకు దగ్గరగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరో తెలిస్తే వారి బలహీనతలను అడ్డంపెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేయొచ్చన్నది వైసీపీ వ్యూహంగా చెబుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకుల ఆస్తులకు సంబంధించిన వివాదాలు, లేదా ఇతర కేసులను అడ్డం పెట్టుకొని వారిని లొంగదీసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

● సొంతింటివారిపైనా నిఘా

అలాగే వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులనూ ఓ కంట కనిపెట్టనున్నారు. ఆ పార్టీ అధినాయకత్వం ఎమ్మెల్యేల పట్ల తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు నాయకులు టీడీపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే కాంట్రాక్టు బిల్లులు, ఇతర వ్యక్తిగత వ్యవహారాల కారణంగా బయటపడటం లేదు కానీ చాలా మంది ప్రతిపక్ష పార్టీ నాయకులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి విషయాలు పసిగట్టి తమ పార్టీ నాయకులపై కూడా నిఘా ఉంచే బాధ్యతను పోలీసు శాఖకు అప్పగించినట్లు తెలిసింది. ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశాలు వెలువడినట్లు సమాచారం.

● వలంటీర్లకు రెండు విధులు

మరోవైపు వలంటీర్లను అదనపు జీతాల పేరుతో ప్రజలపైకి పంపుతోంది. ప్రభుత్వం తరపున ఇస్తున్న 5వేల జీతం కాకుండా వైసీపీ తరపున మరో రూ.5 వేల జీతం ఇస్తామని వలంటీర్లకు ఆశజూపుతోంది. ఎంఎల్‌ఓలు ప్రాంతాల వారీగా వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తున్నారు. ఇలా అదనపు జీతం ఇస్తున్నందుకు ప్రతీగా వలంటీర్లు రెండు పనులు చేయాల్సి ఉంటుంది. ఒకటి వారి పరిధిలోని కుటుంబాలను వైసీపీకి ఓటు వేసేలా మోటివేట్ చేయడం, రెండు ప్రతిపక్ష పార్టీలకు చెందిన సానుభూతిపరులను గుర్తించి ఆ కుటుంబాల పట్టువిడుపులను స్థానిక వైసీపీ నాయకులకు చేరవేయడం, వారి పరిధిలో ప్రతిపక్ష పార్టీ నాయకుల కదలికలను ఎప్పటికప్పుడు ఎంఎల్‌ఓలకు ఉప్పు అందిం చడం చేయాలని ఆదేశిస్తున్నారు. జగనన్న అధికారంలోకి వస్తే జీతాలు పెరగాయనే ఆశ కూడా చూపుతున్నారు. పోలీసుల ద్వారా నాయకులపై, వలంటీర్ల ద్వారా ప్రజలపై, ఐప్యాక్ టీం ద్వారా సొంత పార్టీలో అసంతృప్తులపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.



ఎంఎల్‌వోతో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మదన్‌రెడ్డి

ఎంఎల్‌వో వర్సెస్ టీడీపీ

- రామలింగాపురం సచివాలయం వద్ద ఉద్రిక్తత
- వలంటీర్లతో సచివాలయంలో సమావేశం
- టీడీపీ అడ్డుకోవడంతో వైసీపీ వ్యూహం రట్టు

నెల్లూరు(సిటీ),ఫిబ్రవరి 7 : రానున్న ఎన్నికల్లో వలంటీర్లను అడ్డంపెట్టుకుని తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్న అధికార వైసీపీ అందుకు ఎంఎల్‌వోలను రంగంలోకి దింపింది. పార్టీ ఆదేశాల మేరకు సచివాలయంలో వలంటీర్లతో నిర్వహించిన వైసీపీ ఎన్నికల సమావేశ గుట్టును టీడీపీ నాయకులు రట్టు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అందిన సమాచారం మేరకు... 19వ డివిజన్ రామలింగాపురం సచివాలయంలో ఎంఎల్‌వో (వైసీపీ నియమించిన థర్డ్ పార్టీ ఏజెన్సీకి చెందిన మండల లెవల్ ఆఫీసర్) బుధవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వలంటీర్ల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని స్విచ్చాఫ్ చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే రూ. 5 వేలతో పాటు వైసీపీ నుంచి రూ. 30 వేలు అదనంగా ఇస్తామని తెలిపారు. మీ పరిధిలోని 50 కుటుంబాలు వైసీపీకి ఓటేసే విధంగా కృషి చేయాలని సూచించారు. తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల జీతాలు మెరుగ్గా ఉంటాయని ఆశ చూపారు. ఈ సమయంలో కలగచేసుకున్న ఇద్దరు వలంటీర్లు ఈ పని మేము చేయలేమని చెప్పడంతో వారిని సమావేశం నుంచి బయటకు పంపేశారు. వారి ద్వారా సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఎంఎల్‌వోతో వాగ్వివాదానికి దిగారు. పార్టీకి చెందిన వ్యక్తులు సచివాలయంలో ఎలా సమావేశం నిర్వహిస్తారు...? అంటూ నిలదీయడంతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పరారయ్యారు. అనంతరం ఎంఎల్‌వోకు మదన్‌కు మధ్య గొడవ పెరిగింది. మీడియా అక్కడకు చేరుకోవడంతో ఎంఎల్‌వో కూడా జారుకున్నాడు. కాగా, ఈ విషయమైన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. అధికారులను ఎంఎల్‌వో పై వివరణ కోరగా వారు ప్రభుత్వానికి సంబంధించిన వ్యక్తులు కాదని తెలిపారు.



వలంటీర్ల ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఎంఎల్‌వో

ఇంత దారుణం

ఎన్నడూ చూడలేదయ్యా!

- మా హక్కులు, విధులు, నిధులు కాలరాశారు!
- వైసీపీ ప్రభుత్వంపై సర్పంచుల ఆగ్రహం

'టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో సర్పంచులుగా చేశాం. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న దారుణం మేమెప్పుడూ చూడలేదు. మా హక్కులను కాలరాయడమేగాక నిధులనూ దొడ్డిదారిన లాగేసుకున్నారు. ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పలేక సొంత డబ్బులతో పంచాయతీల్లో పనులు చేస్తున్నాం. బిల్లులు రాక అప్పులపాలయ్యాం' అంటూ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయంపై పలువురు సర్పంచులు 'ఆంధ్రజ్యోతి'తో వెల్లబుచ్చుకున్నారు.

నిధులు, విధులకు కత్తెర



వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులతోపాటు విధులకు కత్తెరేశారు. ఏ చిన్న పని చేయాలన్నా పంచాయతీ ఖాతాల్లో పైసా లేదు. దీంతో డ్రైనేజీ, వీధిలైట్ల, పారిశుధ్య నిర్వహణ కూడా చేయలేకపోతున్నాం. వలంటీర్లకు ఉన్న విలువ సర్పంచులకు లేదు. కాంగ్రెస్, టీడీపీల ప్రభుత్వాల్లో సర్పంచుగా పనిచేశా. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న దారుణం మరే ప్రభుత్వంలోనూ లేదు.

- షేక్ నాజున్నీ, సర్పంచు, తలుపూరుపాడు, సంగం మండలం

ఉత్సవ విగ్రహాలు అయ్యాం



పంచాయతీలకు ఎన్నికలు పెట్టి సర్పంచులను ఎన్నుకున్నారు. మాకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుని మమ్మల్ని ఉత్సవ విగ్రహాలుగా చేసింది. పంచాయతీలో ఏ పని చేయాలన్నా నిధులు అవసరం. నిధుల కొరతతో ఏం చేయలేకపోతున్నాం.

- సునీల్‌కుమార్ నాయుడు, లక్ష్మీనరసింహపురం, మనుబోలు

స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం



వైసీపీ ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. ముఖ్యంగా పంచాయతీ వ్యవస్థ ఘోరంగా దెబ్బతిన్నది. మా మన్నేటికోట పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో తప్పితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క సిమెంటు రోడ్డు వేయలేకపోయాం. 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం చాకచక్యంగా లాగేసుకుంటూ పక్కదారి పట్టిస్తోంది. దీంతో చేసిన పనుల బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నాతోటి సర్పంచులు, పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారు. జనరల్ ఫండ్స్ కూడా వాడుకునే వీలు లేకుండా డిజిటల్ సిస్టమ్ తెచ్చి గ్రామాల్లో వసూళ్లు చేసిన వివిధ రకాల పన్నులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాల్లోకి వేసుకొంది. ప్రజలు ఎంతో నమ్మకంతో సర్పంచుగా ఎన్నుకొన్నప్పటికి నిధుల కొరతతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేయలేకపోయాననే బాధ వెంటాడుతోంది.

- పులివర్తి బసవయ్యనాయుడు, మన్నేటికోట, ఉలవపాడు మండలం

మా విలువలకు వలువలూడదీశారు



వైసీపీ ప్రభుత్వం మా విలువలకు వలువలూడదీసినా కేంద్రం కూడా పట్టించుకోలేదు. సర్పంచుగా ఎన్నికై మూడేళ్లు కావస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి శూన్యం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి కొంతమేర లక్షల్లో అప్పు చేసి పంచాయతీని నెట్టుకొస్తున్నాము. సర్పంచులకు విధులు, నిధులు రెండూ దూరం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. కేంద్రం విడుదల చేసిన 14, 15, ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసి గ్రామాలను అభివృద్ధికి ఆమడదూరంలో నెట్టేసింది. ఆఖరికి పంచాయతీ సిబ్బంది జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి.

- కందికట్టు పెంచలయ్య, జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం మండలం

ప్రత్యేక కేటాయింపుల్లేవ్!

● సాదాసీదాగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్‌అకౌంట్ బడ్జెట్‌లో ఏ ప్రాజెక్టుకూ ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. సాదాసీదాగా రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2.86 లక్షల కోట్ల అంచనాలతో ప్రతిపాదించారు. అందులో ఫలానా శాఖకు, ఫలానా ప్రాజెక్టుకు అంటూ విడివిడిగా ప్రతిపాదనలు చూపలేదు. దీంతో కొత్త ప్రాజెక్టులకు కేటాయింపులు అటుంచితే ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులకు కూడా బడ్జెట్ కేటాయింపులు లేనట్లేనని నిపుణులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేదు. దీంతో ఎన్నికల తర్వాత ఏర్పడబోయే ప్రభుత్వమే పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూపొందించనుంది. ఇప్పటికే బిల్లుల పెండింగ్‌తో చాలా ప్రాజెక్టులు పడకేశాయి. కొన్ని ప్రాజెక్టులకు అరకొరగా నిధులు కేటాయిస్తుండగా, మరికొన్ని ప్రాజెక్టులు గతంలో బడ్జెట్ కేటాయించినా చెల్లింపులు మాత్రం జరగలేదు. ఈ కారణంగా అభివృద్ధిలో కీలకమైన అనేక వర్కులు ఎక్కడికక్కడ ఆగిపోయి ఉన్నాయి. ఇప్పుడు కూడా ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, బిల్లులు వస్తాయో రావోనన్న ఆందోళనలో ఉన్న కాంట్రాక్టర్లు రేపు ప్రభుత్వం మారితే మరిన్ని ఇబ్బందులు ఎదరవుతాయన్న ఉద్దేశంతో మిగిలిన పనులను కూడా నిలిపేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రాధాన్యత ప్రాజెక్టులకు కూడా మోక్షం లభించేలా కనిపించడం లేదు.

అంచనాలు కొండంత.. ఖర్చులు పిసిరంత



13 వేల కోట్ల రెవెన్యూ లోటును 44వేల కోట్లకు, 35వేల కోట్ల ద్రవ్యలోటును 60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదే. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవు. వైసీపీ హయాంలో రెట్టింపు అయిన ఏపీ అప్పులు. 2014-19 మధ్యలో టీడీపీ తీసుకున్న దానికంటే నాలుగురెట్లు ఎక్కువ. అప్పులప్రదేశ్‌గా ఏపీని మార్చిన ఘనత జగన్ అండ్ కోదే.

- అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు

ఇదో గారడీ బడ్జెట్



రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగుతుండటంతో వైసీపీ ప్రభుత్వం గారడీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయలేని ఈ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్ ప్రవేశపెట్టింది. జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

- చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు

అన్నీ అవాస్తవాలే



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నీ అవస్తవాలే వెల్లడించారు. ప్రకటించిన వన్నీ కాకి లెక్కలే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయటం లేదు. ఏ రాష్ట్రంలో చేయలేని వైఎస్సార్ ఉచిత బీమా అమలు చేస్తుంది ఆంధ్రప్రదేశ్ ఒక్కటే నని చెబుతున్న మంత్రి కేవలం కొద్ది మందికే అమలు చేసి అందరికి అమలు చేశామని చెబుతుండటం దారణం. అలా అయితే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారో మంత్రి బుగ్గనే చెప్పాలి.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

అన్నీ జిమ్మిక్కులే



బడ్జెట్‌లో మంత్రి బుగ్గన అన్నీ జిమ్మిక్కులే ప్రదర్శించారు. ఆయన చెప్పినట్లు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో ఎక్కడ అమలు చేశారో చెప్పాలి. 4.95 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. కానీ అవి అమలు కాలేదు. ప్రతి ఏడాది జాబ్ చార్ట్ రిలీజ్ చేస్తామని వైసీపీ ప్రభుత్వం మొదట్లో చెప్పింది. అమలు కాలేదు. మంత్రి బుగ్గన మాత్రం అంతా చేశామని చెబుతున్నారు.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాలకు సముచితస్థానం ఎక్కడ?

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది. అవన్నీ ప్రకటనలే. నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమం గురించి బుగ్గన గొప్పగా వివరించారు. ఇయితే క్షేత్రస్థాయిలో అమలుకు మాత్రం నోచుకోలేదు. అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపామని చెబుతున్నా అది కేవలం లెక్కల్లో మాత్రమే ఉంటోంది.

- దామా అంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- జిల్లాలో 346 పోస్టులు
- 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 7 : ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులు ప్రకటించగా వాటిలో జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈనెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. 12 నుంచి 21వతేదీ వరకు ఫీజు చెల్లించి cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22వతేదీ లోపల దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 24న ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించి మార్చి 5వతేదీ నుంచి హాల్‌టికెట్లు పంపిణీ చేస్తామ న్నారు. మార్చి 15 నుంచి 30వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కాగా, గురువారం నుంచి టెట్ నిర్వ హణ చేపట్టి ఏప్రిల్ 7వతేదీన ఫలి తాలు వెల్లడిస్తామన్నారు. టెట్‌కు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ ఈనెల 17 అని, దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 18గా నిర్ణయించార న్నారు. ఈ నెల 23 నుంచి హాల్‌టికెట్లను అందచేస్తామన్నారు. ఈ పరీక్షను ఈనెల 27 నుంచి మార్చి 9వతేదీ వరకు ఉదయం, మధ్యా హ్నం రెండు సెషన్‌లలో నిర్వహించి మార్చి 14న ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

జిల్లాలో 346 పోస్టులు....

డీఎస్సీకి సంబంధించి జిల్లాకు 346 పోస్టులు కేటాయించారు. దీనిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) 104, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 140, టీజీటీ 102 పోస్టులు ఉన్నాయి.

జనారణ్యంలోకి వన్యప్రాణులు

- వర్షాభావంతో అడవుల్లో తాగునీటి ఇక్కట్లు
- దాహార్తి తీర్చుకునేందుకు గ్రామాల్లోకి రాక



కుక్కల దాడిలో గాయపడిన దుప్పికి చికిత్స చేస్తున్న స్థానికులు (ఫైల్)



రైల్వే స్టేషన్ వద్ద గుంపులు గుంపులుగా ఉన్న కోతులు

బిట్రగుంట, ఫిబ్రవరి 7 : స్వేచ్ఛగా అడవుల్లో తిరిగే జంతువులకు తినేందుకు ఆహారం కొరతతోపాటు తాగేందుకు నీరు లేక జనారణ్యంలోకి వస్తున్నాయి. బోగోలు మండలంలో చాలా వరకు అడవులను నరికి వేయడంతో జంతువులకు రక్షణ లేకుండా పోయింది. అంతేకాక అడవుల్లోని వాగులు, గుంటలు క్రమంగా పూడిపోయి జంతువులకు తాగునీరు కరువైంది. బోగోలు, దగదర్తి మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో 100కు పైగా చుక్కల దుప్పులు, 60 వరకు కణితులు, వెయ్యికిపైగా అడవి పందులు, 70 వరకు నక్కలు, కుందేళ్లు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు అంటున్నారు. ఆహారం కోసం అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉండే పంట పొల్లాలోని పైర్లను అడవి జంతువులు నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువుల వద్దకు నీటికోసం వచ్చే చుక్కలదుప్పులపై తరచూ కుక్కలు దాడి చేస్తున్నాయి. మండలంలోని బోగోలు, విశ్వనాథరావుపేట, తాళ్లూరు పంచాయతీల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జీవిస్తున్న చుక్కల దుప్పులు, కణితులు, అడవి పందులు, కుందేళ్లు, నక్కలు ఆహారం కోసం తరచూ గ్రామాల్లోకి చొరబడుతున్నారు. వన్యప్రాణుల రక్షణార్థం ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో తాగునీటి తొట్లను, గుంటలను ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా అడవుల్లో పండ్ల చెట్లను కూడా నాటాల్సిన అవసరం ఉంది.

సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు



దుత్తలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 8: సార్వ త్రిక ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీఐ వేల్పుల గిరిబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సీతారామ పురం, దుత్త లూరు, వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టుల్లో ఏర్పాటుచేసిన సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం, నగదు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఉమాశంకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం నెల్లూరులోని విజయమహల్ గేటు వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... విజయమహల్‌గేటు వద్ద చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై గుర్తుతెలియని సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై తెల్లని హాఫ్‌హ్యాండ్స్ టీ షర్టు, నీలపు రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7: ఇళ్లమధ్యలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దర్గామిట్ట పోలీసులు దాడులు చేపట్టారు. వివరాల్లోకి వెళ్లితే ముత్తుకూరుకు చెందిన ప్రభుదాస్ నగరంలోని టెక్కేమిట్ట ప్రాంతంలో రైల్వే ట్రాక్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నాడు. బెంగళూరు, పశ్చిమబెంగాల్‌తోపాటు పలు ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ వ్యభిచార కేంద్రంపై నిఘా ఉంచారు. ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో కలిసి అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌పై దాడి చేశారు. నిర్వాహకునితోపాటు ఆకుతోట వడ్డిపాళెంకు చెందిన వెంకటేష్, వెంకటాచలం మండలంకు చెందిన రాజ్‌ప్రమీల్‌ను అరెస్ట్‌చేశారు. ఇద్దరు సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు.

లైంగిక దాడిలో జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 7 : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో నేరం రుజువు కావడంతో సిద్ధపరెడ్డి చెంచయ్య అనే నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి తిరిపిరెడ్డి సుమ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 మే 18వ తేదీన ముత్తుకూరు మండలం వల్లూరు గ్రామానికి చెందిన చెంచయ్య, అదే ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి ఆ పాపపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కారాగార శిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ శైలజారెడ్డి వాదించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన మహిళపై హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే అంజయ్య తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2018 సంవత్సరం ఏప్రిల్ 6వ తేదీన కంభాల సుజాత పుల్లాయపల్లి చెరువు వద్దకు మేకలను మేతకు తోలు కెళ్లింది. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు ఓ వాహనంలో వచ్చి ఆమెను చంపుతామని బెదిరించి మేకలను వాహనంలోకి ఎక్కించడంతోపాటు ఆమె వద్ద ఉన్న వెయ్యి రూపాయల నగదు తీసుకొని, బండ రాయితో కొట్టి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గ్రామస్థులు రావడంతో వారు పరారయ్యారు. ఈమేరకు బాధితురాలు సుజాత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విచారణలో ఇద్దరిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి కడప జిల్లా మైదుకూరుకు చెందిన నాసరి సుంకన్న, కర్నూల్ జిల్లా కోయిలకుంట్ల గ్రామానికి చెందిన శ్రీరామ్ రాజేష్‌లకు ఏడాది పాటు జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5974
వెండి కిలో ధర	రూ. 72,100
వెండి ఒక గ్రాము	రూ. 74.10

జిల్లాలో పాఠశాల విద్య బలోపేతానికి కృషి

- నూతన డీఈఓ రామారావు
- ఓపెన్ స్కూలు జిల్లా కోఆర్డినేటర్‌గా అసదుల్లా ఖాన్



నూతన డీఈఓకు అభినందనలు తెలుపుతున్న గంగాభవాని



ఓపెన్ స్కూల్ డీసీ అసదుల్లా ఖాన్

నెల్లూరు (విద్య) : జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతన జిల్లా విద్యాశాఖాధికారి పీజేవీ. రామారావు తెలిపారు. బుధవారం సాయంత్రం డీఈవోగా ఆయన బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల సమయం తక్కువగా ఉండడంతో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలను పరిశీలించి విద్యార్థులను సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేస్తామన్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాగా, ఇప్పటివరకు డీఈఓగా విధులు నిర్వహించి వయోజన విద్య జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళుతున్న ఆర్ఎస్. గంగాభవానికి డీఈఓ. రామా రావులు ఒకరికొకరు అభినందనలు తెలియచేసుకున్నారు. అనంతరం పదోన్నతి పొందిన గంగాభవానికి, నూనత డీఈఓ రామారావుకు ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, విద్యాశాఖ ఏడీలు, సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే డీఈఓ రామారావును ఉపాధ్యాయ సంఘం నేతలు కలిసి అభినందనలు తెలిపారు.

జిల్లాలో ఓపెన్‌స్కూల్స్‌ను విజయవంతంగా నిర్వహించడంతో పాటు అభ్యాసకుల్లో సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తానని జిల్లా ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్, జిల్లా పరీక్షల విభాగం ఇన్చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఎం.అస దుల్లాఖాన్ తెలిపారు. జిల్లా పరీక్షల విభాగం ఏసీ రామారావు ఇటీవల రాష్ట్ర కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అసదుల్లా ఖాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అందరి సహకారంతో జిల్లాలో ఓపెన్ స్కూల్స్‌ను బలోపేతం చేయడంతో పాటు రానున్న పదో తరగతి పరీక్షలను విజయవంతంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

నత్తతో పోటీ పడుతూ..

- జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు
- ఆసక్తిచూపని సచివాలయ కార్యదర్శులు
- భవిష్యత్తు పరిణామాలపై ఆందోళన
- 15 శాతం కూడా జరగని రిజిస్ట్రేషన్లు



నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 7 : జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. జనవరి 31న ఈ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైనా ఇప్పటివరకు 15 శాతం రిజిస్ట్రేషన్లు కూడా జరగలేదు. సచివాలయ కార్యదర్శి సబ్ రిజిస్ట్రార్ హోదాతో రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఆర్వో ఈ స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అమ్మకందారుగా ఉంటాడు. అయితే, వీఆర్వోల ఆధార్‌కార్డు ఉంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి రావటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వీఆర్వో పరిధిలో సగటున 1100 మంది లబ్ధిదారులు ఉంటుండగా, వీరందరికీ వీఆర్వోనే వ్యక్తి గతంగా రిజిస్ట్రేషన్ చేసినట్టవుతుంది. ఇలా చేయడం వల్ల వీఆర్వోలకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవ కాశం ఉంది. వ్యక్తిగతంగా లెక్కకు మించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నందున ఆదాయపు పన్ను శాఖ దృష్టిలో భారీగా ఆస్తులు విక్రయించినట్లు భావించే ప్రమాదం ఉంది. ఆ శాఖ నోటీసులు ఇస్తే చిరుద్యోగులమైన తమ పరిస్థితి ఏమిటని వీఆర్వోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివాదం తలెత్తి కోర్టు కేసుల వరకు వెళితే వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కోర్టు కేసులకు కూడా వీరే హాజరు కావాలి. ఈ ఇబ్బందుల దృష్ట్యా సచివాలయ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. జిల్లాలో 61,183 ఇళ్ల పట్టాలకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 10,718 రిజిస్ట్రేషన్లనే పూర్తి చేశారు. 15 శాతానికి మించి ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. కాగా, అయితే కొందరు సచివాలయ కార్యదర్శులు సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లబ్ధిదారులతో వెళ్లి అక్కడ వారి వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. అక్కడా వెబ్‌సైట్ సమస్య తలెత్తుతుండటంతో జనంతో నిండిపోతున్నాయి. ఏదిఏమైనా నాలుగు రోజుల్లో నూటికి నూరు శాతం రిజిస్ట్రేషన్లు పుర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు.

పూర్తి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాలి

- డీసీవో సుధాభారతి



సదస్సులో మాట్లాడుతున్న డీసీవో సుధాభారతి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 7 : పీఏసీఎస్‌ల పూర్తి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాలని జిల్లా సహకారశాఖాధి కారి బాలిరెడ్డి సుధాభారతి ఆదేశించారు. సహకార సంఘాల డేటా కంప్యూటరైజేషన్‌పై బుధవారం ఎన్‌డీసీసీబీలో ఒక రోజు అవగాహనా సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ కంప్యూటరైజేషన్‌లో ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్య మైందన్నారు. ఈనెల 15లోగా డేటా కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరుకొల్లులో వైద్యశిబిరం ఏర్పాటు



జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అయూబ్‌అప్సర్

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 7: మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో ఎంపీడీవో సాయిప్రసాద్, వైద్యాధికారి అయూబ్‌అప్సర్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'మంచమెక్కిన ఏరుకొల్లు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మండల అధికారుల బృందం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడంతోపాటు రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటా సర్వే చేపట్టి లార్వాను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. నివాసాలకు సమీపంలో ఉన్న పేడదిబ్బలను తొలగించాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు మరో మూడు రోజుల పాటు వైద్యశిబిరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మురళి, పంచాయతీ కార్యదర్శులు వెంగళరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, హెచ్‌ఈ బీబీజాన్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, అరుణకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పుల కుప్పగా ఓటర్ల జాబితా

- హక్కు తొలగింపుపై ఆవేదన



తన ఓటు తీసివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న చేబోలు సావిత్రమ్మ

విడవలూరు, ఫిబ్రవరి 7: తాజా ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు జరగ్గా, ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని పార్లపల్లిలో చనిపోయిన వారి పేర్లు జాబితాలో ఉండగా, తాజాగా అలగానిపాడులో బతికున్న వారిపేర్లను తొలగించారు. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు కొపర్తి హరనాథ్ బుధవారం అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విలువైన ఓటు హక్కును అధికారులు కాలరాస్తున్నారని ఆరోపించారు. టీడీపీ సానుభూతి పరుల ఓట్లను అధికారులు తొలగించారన్నారు. అడిపూడి చిరంజీవి, చేబోలు సావిత్రమ్మ, గుత్తికొండ వెంకట రమణయ్య, గుత్తికొండ పద్మావతి తదితరుల పేర్లను జాబితా నుంచి తొలగించారని, చనిపోయిన వారి పేర్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు పన్నుతున్న కుట్రలో భాగమే ఓట్లు తొలగింపని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా అలగానిపాడులో తన ఓటును తొలగించారని చేబోలు సావిత్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు

ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా పాశం శ్రీనివాస్



ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పాశం శ్రీనివాస్.

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఫిబ్రవరి 7 : ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ప్రైజెస్) డైరెక్టర్‌గా నెల్లూరు జిల్లాకు చెందిన పాశం శ్రీనివాస్ నియమితులయ్యారు. విజయవాడలోని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరగతి పరిశ్రమల స్థాపనకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కంటైనర్ టెర్మినల్‌పై మంత్రి, సీఈవో పచ్చి అబద్ధాలు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో సోమిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 7 : కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపుపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పోర్టు సీఈవో జీజే రావు పచ్చి అబద్ధాలు ఆడుతు న్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పోర్టు కంటైనర్ టెర్మినల్ ఉద్యోగులతో కలిసి అఖిల పక్షం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు తరలిపోతున్నా, వేలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం ఏమిటని ప్రశ్నించారు. టెర్మినల్ తరలింపుతో రాష్ట్రం ఆదాయాన్ని కోల్పోతున్నా సీఎం జగన్ పట్టించుకోరా అంటూ ధ్వజ మెత్తారు. వేలాది మందికి ఉపాధినిచ్చే కంటైనర్ టెర్మినల్ మూసివేస్తే ప్రజల తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. గురువారం పోర్టు సీఈవోను అఖిలపక్షం నాయకులతో కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు. సీఈవో ఇచ్చే సమాధానం మేరకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ తరలింపునకు వ్యతిరేకంగా గట్టి పోరాటం చేస్తామన్నారు. సీపీఎంకు చెందిన మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోర్టు ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఫయాజ్, జనసేన నేతలు, సీపీఎం, సీపీఐ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల శిక్షణ : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 7 : అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల నిర్వహణపై గురు, శుక్రవారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. నోడల్ అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

దిశ డీఎస్పీగా సాయినాథ్



బాధ్యతలు చేపడుతున్న దిశా డీఎస్పీ ప్రసాద్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7: నెల్లూరు దిశ స్టేషన్ డీఎస్పీగా టీ సాయినాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. భార్యాభర్తల వివాదాలలో కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చి కాపురాలు చక్కదిద్దేలా చొరవ చూపుతానన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలకు వంద శాతం న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. నూతన డీఎస్పీకి దిశ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐలు రామారావు, అజయ్ కుమార్, ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎస్పీ సాయినాథ్ ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అడవిలో పడి ఉన్న వ్యక్తి మృతదేహం


కావలి రూరల్, ఫిబ్రవరి7: పట్టణంలోని సుచేతా నగర్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి (55) మృతదేహాన్ని బుధవారం సాయంత్రం మేకల కాపరి గుర్తించాడు. ఈ విషయాన్ని స్థానిక వీఆర్వో రామ్మోహన్‌రావు ద్వారా పోలీసులకు సమాచారమిచ్చాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ సీఐ కొండవీటి శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం ఉబ్బిపోయి ఉండటంతో సుమారు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కాగా మృతుడు తెల్ల చొక్కా, తెల్ల పంచె ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందుగానే వెన్ను తీసిన వరిపైరు!

- దిగుబడులు తగ్గిపోతాయని రైతుల ఆందోళన
- నకిలీ విత్తనాల ప్రభావమా.. ఇంకేదైనా కారణమా?

కోవూరు, ఫిబ్రవరి 7 : నకిలీ విత్తనాల ప్రభావమా.. వాతావరణం మార్పులా.. లేక ఇంకేదైనా కారణమా తెలియదుకానీ మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పైరు సమయానికి ముందే వెన్ను తీసింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని కోవూరు, ఇనమడుగు, మోడేగుంట, విడవలూరు మండల పరిధిలోని విడవలూరు, అలగానిపాడు ప్రాంతాల్లో ఈ సీజన్‌లో కేఎన్ఎం, నెల్లూరు జిలకర రకాల వరి విత్తనాలను రైతులు సాగు చేశారు. వరి నాట్లు వైసిన 60 రోజుల నుంచి వెన్ను తీయాల్సిన వరి నాట్లు వేసిన 30 రోజులకే వెన్ను తీస్తోంది. దీంతో ఎట్టిన పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు.

ముందుగానే వెన్ను తీస్తోంది




వాతావరణంలో వచ్చిన మార్పు వల్ల వరిపైరు పక్వానికి రాకముందే వెన్ను తీస్తోంది.. గత సీజన్‌లో పంట బాగా పండిందని సంతోషించిన సమయంలో ఈ దఫా పంట సరిగ్గా రాకపోవడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. - పచ్చిపాల హరనాథరెడ్డి, రైతు, కోవూరు



ముందుగానే వెన్ను తీస్తున్న వరి పైరు

పరిస్థితిని ముందుగా గమనించలేకపోయాం



ముందుగానే వరి వెన్ను తీస్తోంది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గే సూచనలు కన్పిస్తున్నాయి. పరిస్థితి ముందుగా గమనించలేక పోయాం. వ్యవసాయాధికారులు పరిస్థితిని గమనించి మాకు జాగ్రత్తలు చెప్పి ఉంటే బాగుండేది.

- అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, రైతు, కోవూరు

ముదురు నారు వేసినందు వల్లే..

భారీ వర్షాల అనంతరం ఎక్కువ కాలం నాట్లేసేందుకు వీలులేకపోవడంతో ముదరు నారును నాటారు. దీని వల్లే 45 రోజుల అనంతరం వరిపైరు పక్వానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. మండల పరిధిలోని కొంత ప్రాంతంలో మాత్రమే ఈ పరిస్థితి తలెత్తింది. అలాంటి పొలంలో రైతులు యూరియా, పొటాష్ ఎరువుల్ని చల్లడం ద్వారా పరిస్థితిని అధిగమించవచ్చు.

- ఇందిరావతి, వ్యవసాయాధికారి, కోవూరు,

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం తప్పదు : యూటీఎఫ్



వరికుంటపాడు: గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 7: ఉద్యోగుల పట్ల నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రతినిధి ఆర్ నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలకే తాము ఓట్లు వేయడం జరుగుతుందన్నారు. అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ ఇంతవరకు హామీని నెరవేర్చకపోగా నూతనంగా జీపీఎస్ విధానాన్ని తీసుకురావడం దారుణమని మండిపడ్డారు. అలాగే డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించకపోగా ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ నగదును సైతం వాడుకొని తిరిగి జమచేయకపోవడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. ఉద్యోగులు ఐక్యంగా జగన్‌కు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారాయణ, వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కలువాయి: యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం కలువాయిలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టరును ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోస్టరు అంటిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదంతో పాత పెన్షన్ పునర్ధురణ రాజకీయ అజెండా కావాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓపీఎస్ సాధనే లక్ష్యంగా అన్ని రాజకీయ పక్షాల నాయకులను కలుసుకుని పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవిబాబు, చల్లా మల్లికార్జునరెడ్డి, బొలిగర్ల మస్తాన్‌బాబు, కె సుధాకర్, వీ కృష్ణయ్య, జీ రాధాకృష్ణ, యూ లక్ష్మీనారాయణ, కె పెంచలయ్య, వజ్రల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వరుడికి అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న వేదపండితులు

సంగం, ఫిబ్రవరి 7: స్థానిక సంగమేశ్వరాలయంలో ఉన్న నందీశ్వరునికి బుధవారం అభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పండ్ల రసాలు, క్షీర, పంచామృత, నవ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరున్ని పూలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు నందీశ్వరుని దర్శించుకున్నారు.

రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్

సంగం, ఫిబ్రవరి 7: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట ప్రాథమిక ప్రాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు రామాదేవి

సంగం, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని సంగం బిట్-1 సచివాలయంలో జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దారు రమాదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వర్ సమస్య ఏర్పడడంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని సచివాలయ సిబ్బంది ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 7: నెల్లూరులో గురు, శుక్రవారాల్లో జరిగే ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఉదయగిరి తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి బుధవారం కోరారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

పల్లెల్లో గుప్పుమంటున్న గంజాయి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 7 : మండలంలోని చుండి, అంకభూపాలపురం, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, గరుకుపాలెం, పోలినేనిచెరువు, కాకర్లవారిపాలెం తదితర గ్రామాల్లో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు కలిగిరి నుంచి గంజాయి తీసుకొచ్చి కొండాపురం, లింగసముద్రం వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లోని నిర్వాహకులకు అందజేస్తునట్లు సమాచారం. గంజాయి నిర్వాహకులు కళాశాలలు, హైస్కూల్ విద్యార్థులు, యువతనే ప్రధాన లక్ష్యంగా చేసుకొని అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిసింది. గంజాయి పొడిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి రూ.50, రూ.100లకు విక్రయిస్తున్నారు. యువకులు గంజాయి తాగి వికృతి చేష్టలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పైపులైను పగిలి తాగునీరు వృథా



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

లింగసముద్రం, ఫిబ్రవరి 7 : మండలంలోని పెంట్రాల సచివాలయం ఎదురుగా ఉన్న తాగునీటి పైపలైన్ పగిలి నీరు వృథాగా పోతోంది.గ్రామంలోని ప్రజలకు మంచినీటిని అందించే తాగునీటి పైపులైన్ పగిలింది.అంతేకాక ఇక్కడ స్థానికంగా ఉన్న ఒకరు ఈ పైపులైన్ నుంచి నీటిని పట్టుకొనేందుకు పైపును ఏర్పాటు చేశారు.అది కూడా ఊడి వచ్చింది. ఈ రెండు కారణాలతో ఈ పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని మోటారు వాహనాల తనిఖీ అధికారి రాములు, ఆర్టీసీ డీఎం కరీ మున్నీసా తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రధాన రహదారి వెంబడి విద్యా ర్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వాహన చోదకుల నిర్లక్ష్యం వలన అమాయకులు బలవుతున్నారని, ముఖ్యంగా యువత అతివేగంగా వాహనాలు నడుపుతూ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. 18 ఏళ్ల దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలికి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1450 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యమన్నారు. అర్హులైన సన్న, చిన్నకారు రైతులు తమ దరఖాస్తులను ఆయా ఉపాధి కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ప్రభుత్వం మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు సైతం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న నారాయణరావు

మర్రిపాడు, ఫిబ్రవరి 7: పరీక్షల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో విద్యార్థులు వత్తిడికి గురికాకుండా చదువుపై శ్రద్ధపెట్టి ప్రశాంతంగా ఉండాలని ఆత్మకూరు తెలుగు భారతి సేవా సంస్థ అధ్యక్షుడు మోటివేటర్ వీ నారాయణరావు సూచించారు. మర్రిపాడు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బట్టీపట్టి చదవకుండా పాయింట్స్ వారీగా నేర్చుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎక్కువ సమయం రాత్రివేళల్లో మేల్కోవద్దని, సెల్‌ఫోన్ వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డీ నారాయణరావు, హెచ్‌ఎం పద్మలత పాల్గొన్నారు.

రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7: జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా మండలంలో 9,896 మంది విద్యార్థులకు మాత్రలు మింగించడమే లక్ష్యమని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, మండల వైద్యాధికారి వినీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అనంతరం ఆల్‌బెండజోల్ 400 ఎంజీ మాత్రలను మింగించాలన్నారు. ఇప్పటికే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పచ్చవ లావణ్య, ఆరోగ్య విద్యాధికారి కె.వెంకటసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సోను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి, ఫిబ్రవరి 7: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితాలను మరోసారి పరిశీలించుకోవాలన్నారు. ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

సీతారామపురం, ఫిబ్రవరి 7 : ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్ అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్ సహాయకులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ళపట్టాలు రిజిస్ట్రేషన్ త్వరితగతిన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు తహసీల్దారుగా సీతారత్నం

మర్రిపాడు, ఫిబ్రవరి 7: మర్రిపాడు తహసీల్దారుగా బుధవారం సీతారత్నం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుండి మర్రిపాడుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో పనిచేస్తున్న డిప్యూటి తహసీల్దారు ఆనంద్‌రావు బుచ్చిరెడ్డిపాలెంకు బదిలీ అయ్యారు.

వరికుంటపాడు తహసీల్దారుగా చంద్రారెడ్డి

వరికుంటపాడు, ఫిబ్రవరి 7: వరికుంటపాడు మండల తహసీల్దారుగా ఏవీపీ చంద్రారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు.

పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 7: ఉదయగిరి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా షేక్ కరీముల్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి కరీముల్లాకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జై భారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొవ్వూరపు

సీతారామపురం, ఫిబ్రవరి 7: జైభారత్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొవ్వూరపు వెంకటేష్‌ను నియమించినట్లు ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముప్పాళ్ళ శ్రీరామరాజు తెలిపారు. బుధవారం మండలంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని, ఐదు రూపాయల సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరాలని కోరారు. జైభారత్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన జగన్ : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 7: నాలుగున్నరేళ్ల జాబ్ క్యాలెండర్‌ను పట్టించుకోని సీఎం జగన్, ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నాడని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని 4వ వార్డు సాయిబాబా గుడిప్రాంతంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చా మనోహర్, పువ్వాడి రమేష్, పువ్వాడి నరసింగరావు, నందనవనం రాము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : కరపత్రం అందచేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు

● కావ్య క్రిష్టారెడ్డిని సత్కరించిన నేతలు

కావలి : టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ఇంటికి బుధవారం పట్టణంలోని పలువార్డుల నుంచి, తీరప్రాంత మత్స్యకార గ్రామాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు తెలిపారు. అలాగే మహా జనసైన్యం యూత్ 150 మంది వరకు వచ్చి కావ్యకు మద్దతు పలుకుతూ టీడీపీ విజయం కోసం కృషిచేస్తామని చెప్పారు. స్థానిక 34వ వార్డుకు చెందిన టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు కావ్యను కలిసి గజమాలతో సత్కరించారు. 11 వవార్డుకు చెందిన టీడీపీ నాయకుడు మైనంపాటి జగదీష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ మోడల్‌కాలనీకి చెందిన వారు కూడా వచ్చి మద్దతు తెలిపారు. అలాగే 18వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు తెలిపారు. కాగా మహా జనసైన్యంకు చెందిన యువత ర్యాలీగా క్రిష్టారెడ్డి ఇంటికి వచ్చి ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహా జనసైన్యం నేతలు కత్తి లక్ష్మణ్, నందల నరేష్‌యాదవ్, రాంబాబు యాదవ్, శివయాదవ్, పెంచల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తాం..

దగదర్తి(బిట్రగుంట) : టీడీపీ అధిష్టానం నిర్ణయం మేరకు తాము పనిచేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు, టీడీపీ కావలి మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తిలోని వారి స్వగృహంలో బుధవారం వివిధ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుతో త్వరలో భేటీ కా నున్నా టటమని, పార్టీ నేతలు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఇతర పార్టీల వారిని టీడీపీలో చేర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్‌నాయుడు, భానుచందర్, శ్రీహరినాయుడు, కంచర్ల.కృష్ణ వోగోపాల్, పులి శీనయ్య, ఇబ్రహీం, ఆసీఫ్, మాధవరావు పాల్గొన్నారు.



కావలి : కావ్య, మలిశెట్టిలను గజమాలతో సత్కరిస్తున్న 34వ వార్డు ప్రజలు



బిట్రగుంట : కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

రోడ్డు ఆక్రమించి రేకుల పంచ



రైల్వేస్టేషన్ సెంటర్‌లో రోడ్డుపైకి వచ్చిన రేకుల పంచ

కావలి,ఫిబ్రవరి7: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను ఎవరు ఆక్రమించినా అడిగే నాథుడే కరువయ్యాడు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో కొత్తగా నిర్మించిన ఓ దుకాణ సముదాయం ముందు మెట్లను రోడ్డుపై నిర్మించారు. అంతకు మునుపు అక్కడ ఉన్న విద్యుత్ స్థంభాన్ని తొలగించి దాన్ని రోడ్డుపైకి వేసేటట్లుగా చేశారు. కాగా ఆ మెట్లను లోపలకు సర్దుబాటు చేయకపోగా అక్కడ వరకు పర్మినెంట్‌గా రేకులతో పంచ వేశారు. దీంతో అక్కడ రోడ్డు కుంచించుకుపోయినా అధికారులు పట్టించుకోవటం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, ఫిబ్రవరి 7 : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనరు ఫణికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎవరికి అనారోగ్య సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రి సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

కందుకూరు, ఫిబ్రవరి 7: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు డీ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న పండ్లమొక్కలను, వనమూలికల గార్డెన్‌లను సందర్శించి, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, బోటనీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి తిరుపతిస్వామి, ఎం. బాలునాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సునీత, ధనమ్మ, వంశీ, మాధవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఉలవపాడు : తహసీల్దార్‌గా బుధవారం కే రవిబాబు బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ బ్రహ్మయ్య బాపట్ల జిల్లా చెరుకుపల్లికి బదిలీపై వెళ్లారు. డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, సర్వేయర్ శ్రీనివాసులు కొత్త తహసీల్దార్‌కు బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వలేటివారిపాలెం : విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవి ఉత్తీర్ణత సాధించాలని కందుకూరు డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జమీన్ ఉప్పలపాడు కేజీబీవీలో బుధవారం ప్రిన్స్‌పాల్ గోవర్ధిని అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవికుమార్, మల్లికార్జునరావు మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశన్, సర్పంచి వింజం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు కమల్‌కుమార్, మాధవరావు పాల్గొన్నారు.

పేదలకు సేవ.. దైవసేవతో సమానం

బిట్రగుంట : అనాథలకు, పేదలకు సేవచేయడం భగవంతుడిని సేవించడంతో సమానమని స్థానిక సంఘ కాపరి పాస్టర్ రెవరెండ్ డీ.దేవానంద్, బ్రదర్ జీ.షాలుమ్‌రాజ్ అన్నారు. బోగోలు మండల విశ్వనాథరావుపేటలో ప్లాటినం తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. అనంతరం పేదలకు భోజనం, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు ఏ.మనోహర్, కార్యదర్శి ఎస్‌పీ ధనరాజ్, ట్రెజరర్ చంద్రహాస్, పాస్టర్లు సీహెచ్.నాగరాజు, శ్యాం సన్‌బాబు, రవికుమార్, స్టీవెన్‌కుమార్ పాల్గొన్నారు.

సురేష్‌బాబు నియామకం హర్షణీయం

బిట్రగుంట : పీసీసీ అధికార ప్రతినిధిగా రెండోసారి కూడా లేళ్లపల్లి సురేష్‌బాబును నియమించడం సంతోషకరమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు తులసీరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి రెండోసారి సురేష్ పేరును ప్రతిపాదించడం సంతోషకరమన్నారు.

వడ్డె కుటుంబానికి పలువురి పరామర్శ



వడ్డె శ్రీరాములు నాయుడుకు నివాళులు అర్పిస్తున్న మాలేపాటి రవీంద్రనాయుడు

దగదర్తి (బిట్రగుంట), ఫిబ్రవరి 7: దగదర్తి మండల సీనియర్ టీడీపీ నాయకుడు వడ్డె శ్రీరాములు నాయుడు(90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ఉత్తరక్రియలు బుధవారం జరగ్గా, పలువురు నేతలు హాజరై నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు మాలేపాటి రవీంద్రనాయుడు, మాలేపాటి సుబ్బానాయుడు, భానుచంద్ తదితరులు శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక నేతలు తాళ్లూరు సుధాకర్ నాయుడు, మాజీ సర్పంచు జలదంకి శ్రీహరి, కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్యకృష్ణారెడ్డి, బోగోలు నేతలు నాగేశ్వరావు, కాండ్ర రఘురామ్ తదితరులు వడ్డె కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు నాయడు, శ్రీకాంత్ నాయుడులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేనేతల భూములకు పట్టాలివ్వండి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికులు

కలిగిరి, ఫిబ్రవరి 7: ముప్పైఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడం చేనేతలను చిన్నచూపు చూడటమేనని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పూజల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దారు బాలకిషోర్‌కు చేనేత కార్మికులతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. కలిగిరి మండలం కొత్తపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1లో 48 ఎకరాల భూమిని ఒక్కొక్క కుటుంబానికి 1.10 ఎకరాల వంతున మొత్తం 44 కుటుంబాలకు 1993లో సీలింగ్ ల్యాండ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ భూములకు ఇప్పటివరకు పట్టాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లా కలెక్టరు చొరవ తీసుకుని ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేస్తున్న పోలీసులు



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత నేతలు

కావలి, ఫిబ్రవరి7: కావలి డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎమ్మెల్యే జోక్యంతో పోలీసులు ఆ కేసులను నిర్వీర్యం చేస్తున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేసి, ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అట్రాసిటీ కేసులో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పోలీసులపై ఒత్తిడి తెచ్చి అసలు కేసు కట్టకుండానే చేస్తున్నారని ఆరోపించారు. డివిజన్‌లో దళిత, గిరిజనులు ఫిర్యాదు చేస్తే కేసులు కట్టనీయకుండా స్థానిక ఎమ్మెల్యే అడ్డుపడుతుండటం ఎంతవరకు న్యాయమన్నారు. ఆర్డీవో స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు కోవూరు బాబు, చౌటూరి వెంకటరత్నం, జరుగుమల్లి విజయరత్నం, గాలి రాజ, డాక్టర్ వేణుగోపాల్, కాకిమల్లి, మస్తానయ్య, ముక్కు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓబులమ్మకు పొంగళ్లు

అల్లూరు, ఫిబ్రవరి 7 : స్థానిక రజకకాలనీలోని ఓబులమ్మకు బుధవారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవర్లకు గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. నాయుడు మల్లికార్జున జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

కావలిటౌన్ : జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏరాష్ట్రంలో కూడా అమలు కావడంలేదన్నారు. ప్రతిపక్షాలు ఏం అభివృద్ధి చేసాయో చెప్పాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ప్రసాద్, అమరావేదగిరి, తిరివీధి ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు నెలలుగా నీరు లేకపోతే పట్టించుకోరా ?

బిట్రగుంట, ఫిబ్రవరి 7: 24 గంటల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మూడు నెలలుగా నీరులేక పోయినా పట్టించుకోవడం లేదంటే సిగ్గుచేటని కోవూరుపల్లి వాసులు పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీకి బుధవారం ఉదయం 8.10 గంటలకు బీపీ, షుగర్ చెక్ చేయించుకునేందుకు స్థానికుడు మురళీరెడ్డి గ్రామస్థులతో కలిసి వెళ్లాడు. ఆ సమయంలో ఆరోగ్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆవేదన చెందాడు. నెమ్మదిగా చేరుకున్న సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న వైద్యులు గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రాత్రి డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు ఇందిర మాట్లాడుతూ ఆ సుపత్రిలో వాష్ రూముకు వెళ్లాలన్నా నీళ్లు లేవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకుపోతామని స్థానికులు మురళీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జైభీమ్ అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడ రవిచంద్ర తదితరులు పేర్కొన్నారు.

రేపు ఆరోగ్య సురక్ష

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 7 : మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు రెండవ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డా..బందిలి దొడ్డా..!



మనుబోలు వద్ద హైవేపై సేదతీరుతున్న ఆవులు

మీరు చూస్తున్న ఈ దృశ్యం మనుబోలు క్రాస్‌రోడ్డు వద్దది. ఇది చెన్నై-కలకత్తా జాతీయరహదారి. నిత్యం నాలుగురోడ్లపై వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. డివైడర్ మధ్యలో ఇలా ఆవులు తిష్టవేసి ఉంటాయి. ఇవి అటు, ఇటు నడుస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల వలన అవి గాయపడడమే కాకుండా ప్రయాణికులను మూలనపడేస్తాయి. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ బందిల దొడ్డిని తలపిస్తోంది. దీనిపై హైవే భద్రతా అధికారులు గాని, పోలీసులు గాని, పంచాయతీ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. ఆవుల యజమానులు వదిలివేయడంతో ఇలా రోడ్లపైన రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలకు అడ్డువస్తుంటాయి. ప్రయాణికులు జరభద్రం.. మనుబోలు వచ్చాక కాస్త వేగం తగ్గించండి.

- మనుబోలు

కామాక్షితాయికి వెండి వింజామరల బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి7: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి నెల్లూరుకు చెందిన చలువాది మల్లికార్జునరావు దంపతులు 279 గ్రాముల వెండి వింజామరలను బహూకరించారని ఆలయ ఈవో. వీ గిరి కృష్ణ బుధవారం తెలిపారు. వీటిని నిత్యం స్వామి,అమ్మవార్ల సేవలకు వినియోగిస్తామని ఆయన తెలిపారు.



కామాక్షితాయికి భక్తులు సమర్పించిన వెండి వింజామరలు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

వైసీపీ ప్రోద్బలంతోనే దొంగ ఓట్లు

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7 : వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే బీఎల్‌వోలు దొంగ ఓట్లు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆరోపించారు. ఈనెల 15లోగా ఓటరు జాబితాను నిష్పక్షపాతంగా తయారు చేయకపోతే ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరినీ కోర్టు మెట్లు ఎక్కిస్తానని హెచ్చరించారు. 16వ డివిజన్‌లో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏ డివిజన్‌కు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపాక అనురాధ, విజేత రెడ్డి, పెనుబర్తి సాయిరాం, మస్తానయ్య మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిచోటా మంచి స్పందన : రమాదేవి

ఏ డివిజన్‌కు వెళ్లినా టీడీపీకి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి చెప్పారు. బుధవారం ఆమె 40వ డివిజన్‌లోని కోనేటిమిట్ట, శివాలయం సెంటర్ తదితర ప్రాంతాల్లో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి రాబోవు ఎన్నికల్లో నారాయణకు అండగా నిలవాలని అభ్యర్థించారు.

స్వర్ణకార కార్మికులకు అండగా ఉంటాం..

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 7 : జిల్లాలోని స్వర్ణకార కార్మికులకు తెలుగుదేశం, జనసేన పార్టీలు అండగా ఉంటాయని టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. బుధవారం కొరడా వీధిలోని సింహపురి స్వర్ణకార కార్మిక సంఘం 13వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్‌ను కట్ చేసి స్వర్ణకార కార్మిక సంఘం వార్షిక వేడుకలను ప్రారంభించారు. రాబోయే ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన కూటమిదేనని తెలిపారు. తాము అధికారంలోని వచ్చిన వెంటనే స్వర్ణకార కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం స్వర్ణకార కుటుంబంలోని మహిళకు కుట్టుమిషన్ అందజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక అనూరాధ, శాంతిలాల్ జైన్, చంద్రశేఖర్, రియాజ్, షాను, సురేంద్ర, స్వర్ణకారులు పాల్గొన్నారు.



ప్రచారంలో నాయకులతో నారాయణ

నారాయణను గెలిపించండి : కోటంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 7: వచ్చే ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. నగరంలోని 14వ డివిజన్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్‌తో కలిసి బుధవారం కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు పసుపులేటి మల్లికార్జున, ఎస్‌కే సుభాన్‌బాషా, అంచూరు శ్రీనివాసులు నాయుడు, కాయల తిరుపతి, ఆదిశేషయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్‌పై అవగాహన

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 7 : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో బుధవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన, పోస్టర్ ఆవిష్కరణలు జరిగాయి. ఎంపీడీవో ఏవీ నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగదేవిపేట పీహెచ్‌సీ డాక్టర్ సీ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం లాంటి అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుందన్నారు. నులిపురుగుల సంక్రమణను తగ్గించేందుకు ప్రతి ఒక్క విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, ఎంఈవో వెంకటేశ్వర నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, వసుంధర, శ్రీనివాసరావు, ఉషారాణి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఆవరణలో త్వరలో గోదాము ఏర్పాటు



మాట్లాడుతున్న రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కోవూరు, ఫిబ్రవరి7: స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సొసైటీ ప్రాంగణంలో త్వరలో 100టన్నుల వరిధాన్యాన్ని నిల్వచేసే గోదామును ఏర్పాటు చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సొసైటీ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పడుగుపాడు, పాటూరు, చెర్లోపాళెం, ఇనమడుగు గ్రామాల్లో రైతుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాముల్ని నిర్వహిస్తు న్నామన్నారు. బంగారు ఆభరణాల్ని తనఖా పెట్టిన రైతులకు సొసైటీ రూ.7కోట్ల మేర రుణాల్ని అందించిందన్నారు. సమావేశంలో సొసైటీ సీఈవో గోవర్ధనరెడ్డి, మేనేజరు సుధా కరరెడ్డి మాట్లాడారు.

సర్పంచుల చలో అసెంబ్లీ విజయవంతం

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 7: సర్పంచులు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ చాంబర్ కార్యవర్గ సభ్యుడు, సర్పంచుల జిల్లా ఇన్‌చార్జ్ గోపిరెడ్డి వెంకటేశ్వర్లు మండలంలోని వీలుకానిపల్లి గ్రామంలో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి మా సర్పంచుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అలాగే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్రంలోని సర్పంచులు, పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులందరికీ అభినందనలు తెలియ జేస్తున్నామన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

పొదలకూరు, ఫిబ్రవరి 7: పట్టణంలోని కాకాణి రమణారెడ్డి కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్టుమెంట్‌లోని వంటశాలలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్యాస్ సిలిండర్‌కి రెగ్యులేటర్ కనెక్షన్ సరిగా బిగించకపోవడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పొదలకూరు ఫైర్ ఆఫీసర్ వరకుమార్ తన సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశారు. తాత్కాలిక నివాసం కావడంతో ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదు.

మనుబోలు తహసీల్దార్‌గా చిరంజీవి



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు, ఫిబ్రవరి 7: మండల తహసీల్దార్‌గా కే చిరంజీవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. అంతకుముందు సిబ్బందిని ఆయన పరిచయం చేసుకున్నారు. డీటీలు శివప్రసాద్, శ్రీకాంత్ రెడ్డిలతో పాటు విఆర్‌వోలు, సర్వే సిబ్బంది కొత్త తహసీల్దార్‌కు ఘన స్వాగతం పలికి పాత తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

కుష్ఠు నివారణపై అవగాహన కలిగి ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి7: కుష్ఠు వ్యాధి నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, హెచ్‌ఐవీ, టీబీ నియంత్రణ అధికారి ఖాదర్‌వలీ కోరారు. బుధవారం బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి ఎలా వస్తుంది.. ఎందుకు వస్తుంది... దేనివల్ల వస్తుంది.. అనే అంశాలతో పాటు వచ్చిన వ్యాధిని గుర్తించడంతోపాటు నివారణచర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పక్షోత్సవాల్లో భాగంగానే ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాన్ని పరామర్శించిన సోమిరెడ్డి



మత్స్యకార కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 7: మండలంలోని కోడూరు మత్స్యకార గ్రామం నడిమిపాలెంలో ఇటీవల పామంజి నర సింహ అనారోగ్యంతో మృతిచెం దాడు. దీంతో ఆయన కుమారుడు పామంజి దొరబాబు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం పరామర్శించి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మత్స్యకార గ్రామాలకు తన తోడ్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన గంగాధర్, ఆవుల మునిరత్నం, భక్తాని రామాంజనేయులు, వివిధ గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపై వైసీపీ నేతల విమర్శలు అర్ధరహితం

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 7: మాజీ మంత్రి సోమిరెడ్డిపై వైసీపీ నాయకులు చేస్తు న్న విమర్శలు అర్ధరహి తమని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, తిరుపతి పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి కొణతం రఘుబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థాయిలేని నేతలు మాజీ మంత్రిని విమర్శించడం సమంజసం కాదన్నారు. మంత్రి కాకాణిపై కేసు కోర్టులోనే ఉన్నదని, విచారణ పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, ఇంగిలాల చైతన్యకుమార్, ఇంగిలాల పెంచలయ్య, ఊటుకూరు అవినాష్, అంతటి శ్రీనాథ్, టి శ్రీనివాసులు, షేక్ అల్తాఫ్, శాంతివర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ సర్పంచికి కురుగొండ్ల పరామర్శ



వెంకటసుబ్బమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, ఫిబ్రవరి7: మండల పరిధిలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో టీడీపీ మాజీ సర్పంచ్ అడ్లూరు నారాయణరాజు, మురళీరాజుల తల్లి వెంకట సుబ్బమ్మ మృతిచెందడంతో బుధవారం ఆమె పెద్దకర్మ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుం బ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వరదబండి వెంకటేష్ రెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, యారం బాబయ్యనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ సర్పంచి మృతికి సంతాపం

మండల పరిధిలోని చాగణం గ్రామంలో టీడీపీ మాజీ సర్పంచ్ కందాటి సుబ్బరాఘవరెడ్డి (80) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. దీంతో బుధవారం మండల టీడీపీ నాయకులు సుబ్బరాఘవరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గం టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, హరనాథ్‌రెడ్డి, కమలపూడి వీరరాఘవ రెడ్డి పాల్గొన్నారు.

సరైన వయసులోనే రాజకీయ అరంగేట్రం చేశా : దినేష్

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి7: 'సరైన వయసులోనే రాజకీయ అరంగేట్రం చేశాను. రాబోయే ఎన్నికల్లో కోవూరు నియోజక వర్గాన్ని గెలుచుకుని చంద్రబాబుకి కానుకగా ఇవ్వబోతున్నా'... అని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. బుచ్చి నగర పంచాయతీ 3వవార్డులో బుధవారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ వార్డు ఇన్‌చార్జి వుసురుపాటి ప్రసాద్‌తో కలిసి ఆయన స్థానికంగా పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కోవూరుతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. తన తండ్రి ఆశయం మేరకు సొంత నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎంవీ.శేషయ్య, బత్తుల హరికృష్ణ, రామానాయుడు, హరనాథ్, కళ్యాణ్, ప్రభాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయంలో వాటా కోసం కమిషనరేట్‌కు అర్చకులు ?

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్రవ్యాప్తంగా వంశపారంపర్య అర్చకులతో దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్, అదనపు కమిషనర్, రీజినల్ జాయింట్ కమిషనర్ బుధవారం విజయవాడలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అర్చకులు వారి డిమాండ్లను తెలియచేశారు. ఈ సమావేశానికి జొన్నవాడ ఆలయ అర్చకులు తరలివెళ్లారని సమాచారం. వారం, పది రోజుల్లో ఆయా ఆలయాల ఈవోలు, దేవదాయశాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఆలయ ఆదాయంలో వాటా, ఆలయాలు అప్పగించే విషయంపై క్షుణ్ణంగా తెలుసుకుని ఆ తరువాత నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే వంశపారంపర్య భూములు అనుభవించే అర్చకులకు రైతు భరోసా పథకాన్ని వర్తింప చేస్తూ జీవో జారీ చేసింది. ఈ విషయంపై జొన్నవాడ ఆలయ ఈవో గిరికృష్ణను వివరణ కోరగా అనుభవదారుల పేర్ల జాబితాను అధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు



ఎంపికైన విద్యార్థులతో వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 7 : విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన వర్సిటీ విద్యార్థులను వర్సిటీ వీసీ సుందరవల్లి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కే సునీత, వై రవీంద్రమ్మ, డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై నేడు శిక్షణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 7 : కొత్త జిల్లా ప్రాతిపదికన జిల్లాలోని ఇంటర్ ప్రాక్టికల్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లకు గురువారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరులోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డీఆర్వో లవన్న, డీవీఈఓ, డీఈసీ సభ్యులు హాజరై దిశానిర్దేశం చేస్తార న్నారు. ఈ శిక్షణకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ...

మలబార్ గోల్డ్ సంస్థ యాజమాన్యం డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని 58 మంది విద్యార్థులకు గురువారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తుందని ఆర్‌ఐవో మరో ప్రటటనలో తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.8వేల నుంచి రూ.10వేల చొప్పున మొత్తం రూ.5.12 లక్షలను అందచేస్తున్నారన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ వీ సంజనా సిన్హా హాజరవుతారని, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

ఇంటర్ ఒకేషనల్ పరీక్షలకు వంద మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు మంగళవారం 100 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం జరిగిన పరీక్షలకు 8 కేంద్రాల్లో 381 మంది హాజరు కావాల్సి ఉండగా 316 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 382 మంది హాజరుకావాల్సి ఉండగా 347 మంది హాజరయ్యారు.

రూరల్ టీడీపీలో భారీ చేరికలు



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గంలో చేరికలు కొనసాగుతున్నాయి. 29, 30 డివిజన్ల నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. గాంధీ నగర్ నుంచి రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చిన వారికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూరల్‌లో చాలా మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందు కు తేదీలు సిద్ధం చేసుకుంటు న్నారని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మరింత మంది పార్టీలో చేరుతారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో నారాయణ యాదవ్, రమేష్ యాదవ్, చెన్నా యాదవ్, వారి అనుచరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డపనేని రాజానాయుడు, వడ్లమూడి రమేష్‌చౌదరి, మన్నేపల్లి రఘు, కనపర్తి గంగాధర్, గుద్దేటి చెంచయ్య, కూకటి హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 7 : నెల్లూరు రూరల్ పరిధిలో వైసీపీ నాయకులు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, దానిపై వెంటనే విచారించి తగిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో మలోలను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కోరారు. నగరంలోని 19 డివిజన్ జగన్స్ కాలేజ్ సచివాలయంలో బుధవారం వైసీపీ నియమించిన ప్రైవేటు ఏజెన్సీ వారు సచివాలయ అధికారులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటివి పునరావృతం అయితే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'వేదగిరి' చైర్మన్ వైసీపీకి గుడ్‌బై



నెల్లూరు రూరల్ : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి అధికార వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ నెల 14న తన అనుచర గణంతో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. బుధవారం దేవరపాళెంలో ఆయన నివాసం వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ తనలాంటి నిజాయితీ కలిగిన కార్యకర్తకు వైసీపీలో విలువలేదన్నారు. శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో పని చేయాలని నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు. గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్లోని వైసీపీలో ఉన్న ప్రధాన నాయకులందరు త్వరలో టీడీపీలోకి రానున్నారని ప్రకటించారు. అనంతరం సురేంద్ర రెడ్డిని మర్యాదపూర్వకంగా టీడీపీలోకి ఆహ్వానించిన ఆయన శాలువాతో సత్కరించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ'కు ఉత్తమ మార్కులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 7 : జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఎన్‌టీఏ విడుదల చేసిన ప్రొవిజనల్ కీ ప్రకారం నారాయణ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నారాయణ బ్రాంచ్‌కు చెందిన షేక్ సూరజ్ 300 మార్కులకు 300 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడన్నారు. బీ రితేష్‌రెడ్డి 281, ఏ శ్రీనికేష్ 280, పీ విఘ్నేష్ సిద్ధు 262, జీ సుబ్రహ్మణ్య కల్యాణ్‌రామ్ 252, జే చరిత సాయి సుష్మ 251 మార్కులు సాధించారన్నారు. వీరంతా ఆరో తరగతి నుంచి నారాయణ విద్యా సంస్థలో చదువుతున్నారని తెలిపారు. మైక్రో షెడ్యూల్, బోధనా పద్ధతులు, మెటీరియల్స్, పరీక్షా విధానాలతోనే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

హౌసింగ్ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్ర మం బుధవారం జరిగింది. హౌసింగ్ జిల్లా అధికారి ఏ నాగరాజు, డీఈఈ పీ దయాకర్, కావలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగ వర ప్రసాద్ పాల్గొని డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జేఏసీ వర్కింగ్ అధ్యక్షుడు, జిల్లా అసి స్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్‌వీఎం మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డీ వెంకటేశ్వర్లు, ట్రెజరర్, కార్యదర్శులు కేసీ పెంచలయ్య, డీవీ సుబ్రహ్మణ్యం, ముక్తాల్‌బాషా, కే మాధవయ్య, కే రవి, తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న అధికారులు, ఇంజనీర్లు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 7 : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య కే రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యా, ఉపాధి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులో భాగంగా విద్యార్థులకు 10 నెలల ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. ఇందులో భాగమైన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పిస్తామని చెప్పా రు. విద్యార్థులకు చివరి సంవత్సరంలో ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణ అందిస్తున్నామన్నా రు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న యువత రానున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉన్నత విద్యాభ్యాసానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, రాణా ప్రమోద్, డీన్ బీ సుధారాణి, అడ్మిన్ డీన్ సీ సీతారామాంజనేయరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ నాగయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం



ప్రచార కరపత్రాలు చూపుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 7: నగరంలో భారతీయ జనతాపార్టీ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. నగర అసెంబ్లీ, పార్లమెంటు లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని శివాజీ సెంటర్‌లో గల వరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో పూజ చేసి ప్రారంభించారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటును ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకుడు పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మిడతల రమేష్, సీపా వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సీటిస్తే గెలిపిస్తాం : ఒట్టూరు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 7 : వచ్చే ఎన్నికల్లో జిల్లాలో బీసీలకు సీటిస్తే పెద్దన్న పాత్ర పోషించి వారిని గెలిపిస్తామని యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బీసీ నేత ఒట్టూరు సంపత్‌రాజ్ యాదవ్ చెప్పారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వెంకటగిరి, ఆత్మకూరు, కావలి తదితర నియోజక వర్గాల్లో బీసీలైన యాదవులు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. బీసీలకు సీటు ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మిన నాగకిషోర్, లలితా రాం, నాగేంద్ర, ఆవుల శ్రీనివాసులు, జానకిరామయ్య, సంజీవయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే వైసీపీ గెలుపు : ఖలీల్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 7 : రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని ఆ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ ఖలీల్ తెలిపారు. వెంకటేశ్వపురంలోని 53, 54 డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టిడ్కో అపార్ట్‌మెంట్ల కమ్యూని టీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సంక్షేమ పథకాలు చూసి ఓట్లు వేస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక క్లస్టర్ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సాఫియా, కరిముల్లా, రాఘవరావు, నాయకులు ముజీర్, మునీర్, అతర్‌బాషా పాల్గొన్నారు.

ములుముడి పంచాయతీకి రూ. 6.80 లక్షలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 7 : మండలంలోని ములుముడి గ్రామ పంచాయతీకి సిద్ది చెరువు ద్వారా రూ. 6.80 లక్షల ఆదాయం సమకూరినట్లు గ్రామ సర్పంచ్ కుండా కరుణాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సిద్ది చెరువులో చేపలు పట్టుకునే హక్కుకై నిర్వహించిన బహిరంగ వేలం పాటల్లో అట్ల అంజయ్య రూ. 6.80 లక్షలకు వేలం పాడుకున్నారని తెలిపారు. ఈ మొత్తాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేసి అభివృద్ధి పనులకు వినియోగిస్తామని తెలిపారు.

ఎస్ఆర్ లైవ్ ఆర్కెస్ట్రా ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 : నగరంలోని రేబాలవారివీధిలో సుస్వర వరల్డ్ మ్యూజిక్ షాపులో ఎస్ఆర్ లైవ్ ఆర్కెస్ట్రా బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆర్డీవో మాలోల హాజరై బ్రోచర్ విడుదల చేశారు. ఈనెల 10వతేదీన దేశస్థాయిలో అగ్రశ్రేణి మ్యూజియన్స్, గాయనీ గాయకులతో లైవ్ బ్యాండ్ ఏర్పాటు చేస్తున్నందుకు నిర్వాహకులు రాజ్ - సాగర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏవీఎస్ కృష్ణమోహన్, మురళీమోహన్, సాగర్, పెంచలరెడ్డి, ప్రశాంతి, ప్రసాద్‌బాబు, రవీంద్రనాధ్‌రెడ్డి, దారా సురేష్ పాల్గొన్నారు.

ప్రాణభిక్ష పెట్టండి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 7 : హోమియో వైద్యం వికటించి తమ బిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉందని, సరియైన వైద్యం అందించేందుకు ప్రజాప్రతినిధులు, పాలక పక్షనాయకులు, అధికారులు సహకరించాలని మూలాపేట తిరుసుపేటకు చెందిన కొత్తపల్లి నీరజ, ఆమె బంధువులు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లి కీర్తి అనే అమ్మాయికి మందులు వికటించి ప్రాణపాయస్థితికి వచ్చిందన్నారు. తమిళనాడులోని రాయవేలూరు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామని, ఈ పరిస్థితికి కారణమైన హోమియో డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్లో రూ.33 లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 7: బిల్లులు లేకుండా రైలులో తీసుకెళుతున్న రూ.33 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఎన్నికల దృష్ట్యా రైళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ భుజంగరావు పర్యవేక్షణలో గూడూరు రైల్వే ఎస్ఐ కొండపనాయుడు తన సిబ్బందితో కలిసి చెన్నై నుంచి విజయవాడ వెళుతున్న పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టారు. గూడూరుకు చెందిన నిమ్మకాయల వ్యాపారి వద్ద రూ.33 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అతన్ని విచారించగా చెన్నైలోని వ్యాపారులు ఇవ్వాల్సిన నగదును తీసుకుని వస్తున్నానని చెప్పారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నగదు ఆదాయపన్నుశాఖ అధికారులకు అప్పచెప్పామని నెల్లూరు రైల్వే సీఐ భుజరంగరావు తెలిపారు.

అంబేడ్కర్ సతీమణిని నివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి సందర్భంగా పవన్‌కల్యాణ్ అభిమాని టోనీబాబు ఆధ్వర్యంలో బుధవారం కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనంతోపాటు ఆయన సతీమణి రామాబాయి గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, సుబ్బు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీ వార్మింగ్ డే : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 7 : నులి పురుగుల నివారణకు శుక్రవారం చేపట్టిన డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐసీడీఎస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎన్నికల అధికారులతో సమీక్షించారు. సిటీలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస వసతులు అందుబాటులో ఉంచాలన్నారు.




సొంత నియోజకవర్గంలో సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంటున్న రోజా, వ్యూహాత్మక ఓట్ల వేటాట మొదలు పెట్టారు. కులసంఘాలను కూడగట్టుకునే పనిలో మునిగితేలుతున్నారు. వాళ్లను ఇంటికి పిలిచి విందు పెట్టి, అక్షింతలు చేతికిచ్చి ఆశీర్వదించమని సినిమా స్టయిల్‌లో కోరుతున్నారని ప్రచారం జరుగుతోంది. పుత్తూరు శివాలయం వీధిలో చందాలు వేసుకుని నిర్మించుకున్న బలిజ సంఘం భవనాన్ని ఏడు నెలల క్రితం దేవదాయశాఖ అధికారులు రాత్రికి రాత్రి కూలగొట్టేయడంతో ఆ వర్గం తీవ్ర అసహనంతో ఉంది. వీరిని బుజ్జగించేందుకు ఆ వర్గంతో సమావేశం ఏర్పాటు చేసి, పుత్తూరు గోవిందమ్మ గుంటలో భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, భూమిపూజను కూడా చేసేశారు. తన సొంత ఖర్చులతో పుత్తూరు నడిబొడ్డున శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని కూడా వాగ్దానం చేశారు. రెండు రోజుల క్రితం విజయపురం మండలం నుంచి క్షత్రియ సామాజిక వర్గ నాయకులను సైతం ఆహ్వానించి వారికి చేసిన మేళ్లను వివరించారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయపురం ఎంపీపీగా లక్ష్మీపతిరాజుకు అవకాశం దక్కకుండా చేశారనే కోపం ఈ వర్గంలో ఇప్పటికీ ఉంది. అలాగే నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో బలమైన సామాజికవర్గం అయిన మొదలియార్లను ప్రసన్నం చేసుకునేందుకు సైతం పడరానిపాట్లు పడుతున్నారు.ఆ సామాజికవర్గంలో ఆర్థికంగా బలమైన వ్యక్తులను పరామర్శల పేరుతో నగరిలోని వారి ఇళ్లకు వెళ్లి మద్దతు కోరిన రోజా... ఇటీవల ఇంటికి ఆహ్వానించి వారి చేతిలో అక్షింతలు పెట్టి మరీ తనను మళ్లీ ఆశీర్వదించాలని సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించినట్లు చెబుతున్నారు. అయితే, ఆ సామాజికవర్గానికి ప్రధాన జీవనాధారమైన పవర్‌లూమ్స్ పరిశ్రమకు ప్రభుత్వం తరఫున ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదనే అసంతృప్తి వారిలో గూడుకట్టుకొని ఉంది. బ్రాహ్మణ సంఘం నాయకులను కూడా ఇలాగే ఆహ్వానించి మద్దతు కోరారని చెబుతున్నారు. రోజా ఇంటికి వెళ్లి అక్షింతలు వేసివచ్చిన ఒక నాయకుడిని పలకరిస్తే, 'నీ పిచ్చిగాని భయ్యా ఈ రోజుల్లో కుల సంఘం నాయకులు చెపితే ఆ సామాజికవర్గం మొత్తం ఓట్లు వేసేస్తారని ఎలా అనుకుంటావు' అని తేల్చేశాడు.

-పుత్తూరు అర్బన్

తిరుమల శేషాచల కొండలను బుధవారం పొగమంచు కప్పేసింది. చలికాలం పూర్తయి త్వరలో వేసవి మొదలవుతున్న క్రమంలో పొగమంచుతో నిండిన తిరుమల కొండలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





దగ్ధమవుతున్న కారు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు దగ్ధం

గూడూరు, ఫిబ్రవరి 7 : ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ కారు దగ్ధమైన సంఘటన గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది కథనం మేరకు.... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దినేష్‌కుమార్‌పాండే బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి కారులో జార్ఖండ్‌కు బయల్దేరాడు. బుధవారం తిప్పవరప్పాడు సమీపంలో వెళుతుండగా రోడ్డుపై హఠాత్తుగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో కారుఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. స్థానికులు కారులో ప్రయాణిస్తున్న దినేష్‌కుమార్‌పాండేతోపాటు, అతడి కుటుంబ సభ్యులు రూపేష్‌పాండే, లలితాపాండే, ఆరూహిపాండేలను కారు నుంచి బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

మెజారిటీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఖరారు

జనసేన నుంచీ స్పష్టత లేక మూడు చోట్ల పెండింగ్

మరో మూడు స్థానాల్లో తుదిదశలో కసరత్తు



ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మొత్తం 17 అసెంబ్లీ స్థానాలకు గానూ మెజారిటీ నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. ఇంచుమించు 11 సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో అధిష్ఠానానికి స్పష్టత వచ్చింది. స్పష్టత వున్న చోట్ల అభ్యర్థులు ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పాటు ఎన్నికల ప్రచారమూ మొదలు పెట్టేశారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక జరగాల్సివుంది. ఇందులో మూడు స్థానాలకు సంబంధించి మిత్రపక్షమైన జనసేనతో కలసి నిర్ణయం తీసుకోవాల్సి వున్నందున వాటిని పెండింగులో వుంచారు. చివరగా మిగిలిన మూడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరుకుంది. మొత్తంమీద మూడింట రెండొంతుల సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో స్పష్టత వున్నందున ప్రచార కార్యకలాపాలు జోరందుకున్నాయి.

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా తిరుపతి జిల్లా ఆవిర్భావంతో నెల్లూరు నుంచీ మూడు నియోజకవర్గాలు చేరాయి. దీంతో ఈ 17 నియోజకవర్గాలకు గానూ 11 చోట్ల అభ్యర్థుల విషయమై పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చేసింది. కుప్పంలో అధినేత పోటీలో వుంటారనేది చెప్పక్కర్లేదు. అక్కడ పార్టీ యంత్రాంగం ఎన్నికలకు సన్నద్ధమవుతూ ఏ స్థాయి నాయకులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభ్యర్థిత్వంపైనా ఎవరికీ అనుమానాల్లేవు. పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి, పీలేరులో నల్లాకి కిషోర్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని ఇదివరకే అధినేత, యువనేత ఇద్దరూ పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో డాక్టర్ థామస్ ఇంచార్జులుగా వున్నారు. నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నాని, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ అభ్యర్థిత్వాలపైనా సందేహాలకు తావు లేదు. వీరి గెలుపుకోసం యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో పిలుపిచ్చారు. గూడూరులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభ్యర్థిత్వాలు కూడా ఖరారైనట్టే. ఏవైనా అనూహ్య పరిణామాలు తలెత్తితే తప్ప ఈ నియోజకవర్గాల్లో మార్పుచేర్పులకు అవకాశం లేదు. ఈ 11 చోట్ల అభ్యర్థులను అధికారికంగా ప్రకటించడమే మిగిలివుంది. దీనికి తగ్గట్టు ఈ నియోజకవర్గాల్లో దాదాపుగా ఎన్నికల ప్రచారం మొదలైపోయింది. ఇంచార్జులుగా గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, వైసీపీలో అసంతృప్తితో వున్న నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడం వంటి పనుల్లో బిజీగా వున్నారు.

తంబళ్లపల్లి, సత్యవేడు, సూళ్ళూరుపేటల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రధాన దృష్టి

చిత్తూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె,తిరుపతి, సత్యవేడు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక ఇంకా పెండింగులో వుంది. వీటిలో తంబళ్ళపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేటలపై ప్రస్తుతానికి ప్రధానంగా దృష్టి సారించింది. తంబళ్ళపల్లెకు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ ఇంచార్జిగా వున్నారు. ఆయన నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వున్న సంగతి తెలిసిందే. అడపాదడపా నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నారని, పూర్తిస్థాయి రాజకీయాలు చేయడం లేదని అధిష్ఠానానికి ఫీడ్ బ్యాక్ వుంది. అక్కడ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డిని ఓడించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వుందని, దాని కోసం పూర్తి సమయం కేటాయించాలని అధినేత ఎన్నిసార్లు హెచ్చరించినా శంకర్ దానికనుగుణంగా పనిచేయడం లేదని సమాచారం. రెడ్ల ఆధిపత్యం, ప్రాబల్యం కలిగిన నియోజకవర్గం కావడంతో మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ తనయుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్ రెడ్డిని బరిలోకి దింపే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అయితే దీనిపై రెండేళ్ళుగా ప్రచారమే తప్ప ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రవీణ్ రాకపై శ్రేణుల్లో నమ్మకం, ఆసక్తి కూడా సన్నగిల్లుతున్నాయి. ఈలోపు ఆర్థిక పరిపుష్టి కలిగిన ఒకరిద్దరు ఆశావహులు తెరపైకి వచ్చారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బీసీలకు కనీసం ఒక సీటైనా ఇవ్వాలన్న డిమాండ్ ఆ వర్గాల నుంచీ వినిపిస్తున్న నేపథ్యంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. సత్యవేడు విషయానికొస్తే మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇంఛార్జిగా వున్నారు. పార్టీకి కంచుకోట వంటి ఈ నియోజకవర్గంలో స్థిరమైన నాయకత్వం మాత్రం లేదు. దీంతో ప్రతి ఎన్నికల్లోనూ అభ్యర్థి ఎంపిక ప్రహసనంగా మారుతోంది. ఇక్కడ టికెట్ కోసం ఇంఛార్జి హెలెన్ గట్టిగా పోరాడుతుండగా రేసులో గత ఎన్నికల అభ్యర్థి జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య పేర్లు కూడా వినిపిస్తున్నాయి. టికెట్ ఎవరికనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. సూళ్ళూరుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఇంఛార్జిగా వున్నారు. మాజీ మంత్రి పరసా రత్నం, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య తదితరుల పేర్లు కూడా టికెట్ రేసులో వినిపిస్తున్నాయి. ఈ మూడు స్థానాలపైనే ఇపుడు అధిష్ఠానం ఎక్కువ ఫోకస్ పెట్టింది.వారం పదిరోజుల్లో ఈ స్థానాలపై పార్టీ ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది.

మూడు స్థానాల్లో ఎంపికపై ప్రతిష్టంభన

తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలిజ సామాజికవర్గం ఓటర్లు అధికంగా వున్నందున వీటిలో మూడూ గానీ లేదా రెండు గానీ మిత్రపక్షమైన జనసేన పార్టీ కోరుతోంది. అయితే మూడు చోట్లా వేర్వేరు కారణాలతో జనసేనకు కేటాయించే పరిస్థితులు కనిపించడం లేదు. ఉదాహరణకు తిరుపతి స్థానం తీసుకుంటే ఇక్కడ జనసేనకు బలమైన అభ్యర్థులు అందుబాటులో లేరు. టీడీపీలో మాత్రం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్ వంటివారు టికెట్ తమకేనని ధీమాగా వున్నారు. చిత్తూరులోనూ జనసేనకు తగిన అభ్యర్థులు దొరకని పరిస్థితి. అయితే డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య ఆ పార్టీ టికెట్ కోసం యత్నిస్తున్నట్టు సమాచారం.ఇక్కడ టీడీపీ టికెట్‌కు మాత్రం తీవ్ర పోటీ వుంది. రేసులో శ్రీరామనేని చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత తదితరుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మదనపల్లెలో జనసేనకు గంగారపు రామ్‌దాస్‌చౌదరి వంటి చెప్పుకోదగ్గ నాయకులు అందుబాటులో వున్నారు.అదే సమయంలో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్,షాజహాన్ బాషా టీడీపీ టికెట్ కోసం గట్టిగా యత్నిస్తున్నారు. జనసేనకు కేటాయించే సీట్లపై ఇంకా స్పష్టత రానందున తిరుపతి, మదనపల్లె, చిత్తూరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రతిష్టంభన నెలకొంటోంది.

ఎంపీ స్థానాలపైనా కొనసాగుతున్న సస్పెన్స్

ఈ 17 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన తిరుపతి, చిత్తూరు, రాజంపేట ఎంపీ స్థానాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. తిరుపతి నుంచీ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారికను అధిష్ఠానం దాదాపు ఖరారు చేసింది. అయితే ఈలోపు ఆ సీటును జనసేన కోరినట్లు సమాచారం. దీంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక పెండింగులో పడింది. కాకపోతే జనసేన పార్టీకి కేటాయించడానికి అభ్యర్థి ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. బలమైన అభ్యర్థిని ప్రతిపాదించే పక్షంలో సీటు కేటాయించేందుకు టీడీపీ అధిష్ఠానం సుముఖంగా వున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరు రిజర్వుడు స్థానానికి కూడా అభ్యర్థి విషయంలో టీడీపీ ఒక అభిప్రాయానికి రాలేదు. పలువురు ప్రధాన మంత్రుల వద్ద భద్రతాధికారిగా పనిచేసిన రిటైర్డు పోలీసు అధికారి పీసీ స్వామి వంటి వారు రేసులో వున్నారు. రాజంపేట సీటు కోసం ప్రధానంగా అన్నమయ్య జిల్లా నుంచే ఆశావహులు రేసులో వున్నారు. మొత్తానికి ఈ మూడు ఎంపీ స్థానాలతో పాటు తంబళ్లపల్లె, మదనపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేట, చిత్తూరు, తిరుపతి తదితర ఆరు అసెంబ్లీ సీట్లపై వారం పదిరోజుల్లో పూర్తి స్థాయి స్పష్టత రానుంది.

భార్యపై అనుమానం

నిద్రిస్తుండగా కత్తితో దాడి చేసి పరారైన భర్త

కేవీబీపురం, ఫిబ్రవరి7: నిద్రపోతున్న భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన భర్త పైశాచికత్వమిది.ఎస్ఐ సునీల్ కథనం మేరకు... కేవీబీపురం మండలంలోని కస్తూరిపురం గిరిజన కాలనీలో దంపతులు చంద్రయ్య,రత్నమ్మ(32) ఎనిమిదేళ్లుగా నివసిస్తున్నారు.మూడవ భార్య అయిన రత్నమ్మపై చంద్రయ్యలో ఇటీవల అనుమానబీజం మొలకెత్తడంతో పలుమార్లు గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రత్నమ్మ తన కుమారుడితో ఇంట్లో నిద్రిస్తుండగా చంద్రయ్య ఇంటి బయట పడుకున్నాడు. సుమారు 11గంటల సమయంలో భార్యపైన విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన రత్నమ్మను 108 అంబులెన్సులో పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.



గాయపడ్డ రత్నమ్మ అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు

సింగిల్ బెడ్‌రూం ఇంట్లో 32 ఓట్లు!

తొలగించమని ఇంకెన్నిసార్లు చెప్పాలన్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అబ్బన్న కాలనీలో 18-39-ఎస్4-407 డోరు నెంబరుగల సింగిల్ బెడ్‌రూం ఇంటిలో 32 మంది ఓటర్లు ఇంకా కొనసాగుతుండడం చూసి టీడీపీ నేతలు మండిపడ్డారు. టీడీపీ బీఎల్‌ఏ ఇచ్చిన సమాచారం మేరకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ ఇతర టీడీపీ నేతలు బుధవారం సదరు డోర్ నెంబరు కలిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్త ఇల్లుగా గుర్తించారు. ఇంత చిన్న ఇంటిలో 32 ఓట్లు ఎలా వచ్చాయని ఆ కార్యకర్తను ప్రశ్నించగా గతంలో ఇక్కడ ఉండేవారని, ఇప్పుడు మంగళం తదితర ప్రాంతాల్లో ఉన్నారని, ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు వేసి పోతుంటారంటూ అతను నిర్భయంగా చెప్పిన సమాధానానికి విస్మయానికి గురయ్యారు. నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలోనే దొంగ ఓట్లు చేర్చినట్టుగా అంచనాకొచ్చారు.ప్రస్తుతం ఆ ఇంట్లో వున్న ఇద్దరి ఓట్లను మాత్రమే వుంచి మిగిలిన ఓట్లను తొలగించాలని డిమాండు చేశారు. తిరుపతిలో దొంగ ఓట్లపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు.టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, మునిశేఖర్ రాయల్, మహేష్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ, రాజేంద్ర ప్రసాద్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు ఎన్నికల పాఠాలు

●శ్రీకాళహస్తిలో రహస్య సమావేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: వలంటీర్లను పూర్తిస్థాయి వైసీపీ రాజకీయ కార్యకర్తలుగా ఎన్నికల్లో వినియోగించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తిలో బుధవారం వలంటీర్లను సమావేశపరచి రాజకీయ పాఠాలు బోధించారు.ఎఫ్‌ఓఏ (ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజన్సీ) సమావేశం ఉందంటూ శ్రీకాళహస్తి పట్టణంలోని 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సమాచారం అందింది. ప్రభుత్వ పథకాల అమలు, ప్రచారం గురించి శిక్షణ ఇచ్చే ఎఫ్ఓఏ సమావేశాలు సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనే జరుగుతుంటాయి.ఈ సమావేశం మాత్రం పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథిగృహంలో నిర్వహించారు. పట్టణంలోని 22 సచివాలయాల్లో సినిమా వీధి 1, సినిమా వీధి 2, సినిమా వీధి 3, దోబీ ఘాట్, పెద్ద మసీదు వీధి, ఎంఎం వాడ 1, ఎంఎం వాడ 2, తెలుగు గంగ కాలనీ, జయరాం రావు వీధి సచివాలయాల పరిధిలోని వలంటీర్లను మాత్రమే తొలివిడత సమావేశానికి పిలిచారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలను పాఠాలుగా వీరికి బోధించారు. వలంటీర్ల వద్ద ఇప్పటికే ఉన్న పౌర, ఓటర్ల సమాచారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎలా అనుకూలంగా మార్చుకోవాలి, బయట ప్రాంతాల్లో నివసించే స్థానిక ఓటర్లు ఎవరు, పోలింగ్ సమయంలో వారిని ఎలా తీసుకురావాలి, పక్కాగా వైసీపీ వ్యతిరేక ఓటర్లు ఎవరో గుర్తించి జాబితాలు సిద్ధం చేయడం వంటి పనులను వారికి వివరించారు. సమాచారం తెలిసి మీడియా ప్రతినిధులు వెళ్లగానే కొందరు వలంటీర్లు ఫొటోల్లో కనిపించకుండా ముఖం పక్కకి తిప్పేశారు. ఇది సాధారణ ఎఫ్ఓఏ సమావేశం మాత్రమే అని నిర్వాహకులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.



ఎఫ్‌ఓఏ సమావేశంలో వలంటీర్లు

డీఎస్సీలో వచ్చేది 337పోస్టులే

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 7 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఎదురుచూసీచూసీ కళ్లుకాయలు గాచిన నిరుద్యోగులను ప్రభుత్వం బుధవారం వెలువరించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లోని వేకన్సీ పోస్టులు తీవ్రంగా నిరాశపరిచాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి మొత్తం 337పోస్టులనే చూపారు.ఎస్జీటీలో 101, ఎస్ఏలో 97, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)లో 139 చొప్పున మొత్తం 337పోస్టులు మాత్రమే ఉన్నాయి. వీటిలో ఎస్ఏ, టీజీటీలో కలిపి 236 వేకెన్సీలు ఉండడం గమనార్హం.

గ్రావెల్ తవ్వకాలకు హైకోర్టు బ్రేక్

● ఆరు టిప్పర్లను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 7: పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ తవ్వకాలకు బ్రేక్ పడింది. అధికార పార్టీకి చెందిన నేతలు ఇష్టారీతిగా గ్రావెల్ తవ్వి తరలిస్తుండడంపై రోసనూరుకు చెందిన ఎం.సుబ్రమణ్యం, వి.పరంధామరెడ్డి, కె.రంగారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తవ్వకాలపై హైకోర్టు స్టే విధించడంతో బుధవారం మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. నిజానికి వైసీపీ నాయకులు ఇప్పటికే కోట్లాది రూపాయల గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో మైనింగ్ అధికారులు కొరడా ఝళిపించారు. బుధవారం గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ఆరు టిప్పర్లను సీజ్ చేసి పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టుబడిన టిప్పర్లకు జరిమానా విధించామన్నారు. ఇకపై గ్రావెల్ అక్రమ తరలింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: పాశం


టీడీపీలో చేరిన వారితో పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పేటేటి శ్రీనివాసులు, ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి పలువురు టీడీపీలో చేరారు. వారికి పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన యువత, మహిళలు భారీగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగభృతి అందజేడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించుకుని చంద్రబాబునాయుడిని సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. సుధీర్, దుర్గారావు, సాంబయ్య, వెంకమ్మ, అశోక్‌బాబు, శ్రీనివాసులు, ప్రసాద్, వినోద్ తదితరులకు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నరసింహులు, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, ఔరంగ్‌బాషా, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, వెంకటేష్, సునీల్, సందీప్, వెంకటసాయి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపుదాం: నెలవల


కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 7: మహిళలను ఆర్థికంగా అణగదొక్కుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని చెన్నప్పనాయుడుపేట పంచాయతీ పరిధిలోని పత్తిపాడు వడ్డిపాళెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా వ్యతిరేక ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను మభ్య పెడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ దాష్టీకాలకు అడ్డుకట్ట వేసే రోజులు దగ్గర పడ్డాయని స్పష్టం చేశారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, వేలూరు హరినాయుడు, రాధానాయుడు, రమణయ్య, ప్రసాదరాజు, గోపాల్‌కృష్ణ, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే భూ కబ్జాలు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 7: మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలు విలువ కలిగిన భూములు అధికారులు నిర్లక్ష్యతనే కబ్జాకు గురవుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. బుధవారం అత్యవసర కౌన్సిల్ సమావేశంలో నిర్వహించారు. అధికారులు అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయలు విలువ గల ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు అందజేస్తున్నారని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. ఎన్‌జేఆర్ సర్కిల్, మున్సిపాలిటీ వద్ద ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సర్వే చేసి వాటి పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల క్రయవిక్రయాల్లో అవకతవకలపై విచారణ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఈ రమేష్ చౌదరి

కోట, ఫిబ్రవరి 7: కోట మండల పరిధిలోని విద్యానగర్ ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్ల క్రయవిక్రయాల్లో అవకతవకలపై ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ చౌదరి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో వాకాడు మండలంలో అప్పటి ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో రొయ్యల రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల విక్రయాలు, కొనుగోళ్ల అవకతవకలు జరిగినట్లు తెలిపారు. రూ.50 లక్షల విలువచేసే ట్రాన్స్‌ఫార్మర్లు పక్కదారి పట్టాయి. దీంతో అక్కడ పనిచేసే లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను అప్పట్లో ట్రాన్స్‌కో సస్పెండ్ చేసింది. అదే విధంగా ఏడీఈని తిరుపతికి బదిలీ చేశారు. విచారణను మరింత వేగవంతం చేసేందుకు రికార్డులను తనిఖీ చేశామని ఈఈ రమేష్ చౌదరి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి7: మండలంలోని కందలి గ్రామంలో అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... కందలి గ్రామం అరుంధతీయవాడకు చెందిన రమణయ్య(60) మంగళవారం గ్రామ సమీప పొలాల్లో మేకలను మేపుకునేందుకు వెళ్లాడు. పొలాల్లోనే మృతి చెంది ఉండడంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

గూడూరు, ఫిబ్రవరి 7: మండలంలోని గాంధీనగర్ సమీపంలో గల టిడ్కోగృహాల్లో బుధవారం ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సుభాషిని కుమార్తె సుప్రియ(17) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు

కలెక్టర్ లక్ష్మీశా


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

చిల్లకూరు, ఫిబ్రవరి 7: ఓటర్ల జాబితాలలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. బుధవారం చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 114, 115 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరణించిన, డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి ఓటర్ల జాబితాను సరిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో త్వరితగతిన వసతులను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు, బోధనా విధానాలు, మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సామర్థ్యాలతో కూడిన బోధనను అందించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని కోరారు. అంతకుముందు చింతవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లను, వార్డును పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం తరువాత స్థానిక మండల కార్యాలయ ఆవరణలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని అర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఈవో శేఖర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు సరే.. స్థలం ఎక్కడ?

తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమసానిగుంట మహిళల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7: తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలం ఎక్కడుందో చూపాలంటూ వెంకటగిరి మండల పరిధిలోని సోమసానిగుంట గ్రామానికి చెందిన మహిళలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తమకు జగనన్న లే అవుట్ పేరుతో అధికారులు ఇంటి పట్టాలు అందజేశారని తెలిపారు. అయితూ పట్టా కాగితాల్లో ఉన్న సర్వే నెంబరులో బీడు భూమి తప్ప లేఅవుట్ వేయలేదన్నారు. ఇళ్ల నిర్మించుకోవడానికి స్థలం ఎక్కడుందో తెలీక పలుమార్లు అధికారులను కలిసి సమస్య వివరించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.

పోలీసుల నిర్బంధంలో ఆశావర్కర్లు

గూడూరు, ఫిబ్రవరి 7: విజయవాడలో గురువారం జరిగే నిరసన కార్యక్రమానికి వెళుతున్న ఆశావర్కర్లను బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేటకు చెందిన ఆశావర్కర్లు రైళ్లలో వెళుతుండగా పోలీసులు గుర్తించి స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆశావర్కర్లకు మద్దతు తెలిపారు.

తిరుపతిని రాజధాని చేయాలి: చింతా



గూడూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రానికి తిరుపతిని రాజధానిగా చేయాలంటూ మాజీ ఎంపీ చింతామోహన్ బుధవారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అమరావతిని రాజధానిగా ప్రకటిస్తే, సీఎం జగన్ విశాఖపట్టణాన్ని రాజధానిగా చేయాలని చూస్తున్నారని, అయితే ప్రజలందరూ తిరుపతిని రాజధాని చేయాలని కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, బాస్కర్, నేహ్మాయా తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని పోలేరమ్మ గుడివద్ద నిరసన తెలిపారు. విలేకర్లతో ఆయన మాట్లాడారు. బ్రహ్మంగారు చెప్పినట్లు తిరుపతి రాజధాని అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు నాగూర్, గాడి వెంకటయ్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా: దూర్తటి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పీసీసీ మాజీ కార్యదర్శి దూర్తటి మధుసూదనరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కొందరు నాయకులు ఎన్నికల సమయంలో హడావిడి చేసి వెళ్లిపోవడం వల్ల నియోజకవర్గంలో పార్టీని నడిపే నాయకుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజనంతరం 2014లో తాను కాంగ్రెస్ నుంచి పోటీ చేశానని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇస్తే పోటీ చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్రావ్, ఎస్‌కే నాగూరు, గాడి వెంకటయ్య, అల్లాద్దీన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయండి

కోట, ఫిబ్రవరి 7: కోట మండలంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.నాయకులు అంబరీషా, వెంకటేశ్వర్లు, తిరుపాలయ్య, శ్రీనివాసులు, మహేష్, పరుశురాంసాయి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7: నాయుడుపేట డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు ఎస్‌బీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు.

బాలాయపల్లి తహసీల్దారుగా పుల్లారావు

బాలాయపల్లి, ఫిబ్రవరి 7: బాలాయపల్లి తహసీల్దారుగా పుల్లారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు తిరుపతి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నరసారావుపేటలో పనిచేస్తున్న పుల్లారావు బాలాయపల్లికి వచ్చారు. కొత్త తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు.

చిట్టమూరు తహసీల్దారుగా శ్రీనివాసశర్మ

చిట్టమూరు, ఫిబ్రవరి 7: చిట్టమూరు తహసీల్దారుగా శ్రీనివాసశర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డీటీ నిరంజన్‌కుమార్, ఆర్ఐ మధులత, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్‌వోలు, సిబ్బంది స్వాగతం పలికారు.

వాకాడు ఏపీఎంగా మాధవి

వాకాడు, ఫిబ్రవరి 7: వాకాడు మండల ఏపీఎంగా మాధవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో సీసీగా విధులు నిర్వహిస్తూ ఏపీఎంగా పదోన్నతి పొందిన ఆమెను సీసీలు అభినందించారు. కార్యక్రమంలో సీసీలు మురళి, వెంకటసుబ్బయ్య, భూదేవి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వర్ణముఖినది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఎస్ఈబీ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

సిలికా లారీల అడ్డగింత

చిల్లకూరు, ఫిబ్రవరి 7: మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామస్థులు బుధవారం సాయంత్రం సిలికా లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం మీదుగా సిలికా లారీ వెళ్లే సమయంలో దుమ్ములేచి సమీపంలో ఉన్న ఇళ్లలోకి చేరుతోందన్నారు. ఇళ్లలో దుమ్ము నిండిపోయి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు చర్యలు తీసుకుని దుమ్ము ఇళ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

భూ ఆక్రమణలపై వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, ఫిబ్రవరి 7: మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆయా పరిధిలోని వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు నాంచారయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భూముల ఆక్రమణలపై అందుతున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించేలా వీఆర్వోలను ఆదేశించామన్నారు. ముఖ్యంగా మండలంలో బంజరు, మేతపరంబోకు, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురౌతున్నట్లు ఆయా గ్రామాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 7: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో టీడీపీ టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంఘ నేత గెరిటి చెంచయ్య కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉన్నారని చెప్పారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో చూస్తే బీసీలకు ఒక టికెట్ కూడా కేటాయించలేదన్నారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మన్నారపు వెంకటరత్నం, మారెళ్ల వెంకటాద్రి, సత్తల గిరిప్రసాద్, రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ వలంటీరుకు అభినందన


చందనకు అభినందిస్తున్న కళాశాల బృందం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7: సూళ్లూరుపేటలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ వలంటీరు కె.చందన ఢిల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో పాల్గొంది. బుధవారం కళాశాలకు తిరిగి వచ్చిన చందనకు ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, ఎన్‌ఎస్ఎస్ అధికారులు ఏడుకొండలు, శ్రీనివాసులు, ఎస్ఐ రహీం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోతుల దారిలో ప్రయాణమెలా?


చెన్నూరు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

గూడూరు, ఫిబ్రవరి 7: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గోతులమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గూడూరు నుంచి చెన్నూరుకు వెళ్లే రోడ్డు గతేడాది నవంబరులో కురిసిన వర్షాల కారణంగా గుంతలయమంగా మారింది. ఈ మార్గంలో చెన్నూరు, తిప్పవరప్పాడు, వెంకటగిరి, రాపూరు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చెన్నూరు సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడంలేదని వాహనదారులు చెబుతున్నారు. అదేవిధంగా స్థానిక బీసీ కాలనీ సమీపంలో వేముల పాళెం వెళ్లే రోడ్డు, చవటపాళెం నుంచి దివిపాళెం వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

టీడీపీతోనే అభివృద్ధి


కరపత్రాలు అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 7: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక సాధుపేటలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలు, అరాచకాలను ప్రజలకు వివరించి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, చంద్రమౌళి, రమేష్‌నాయుడు, మోహన్, శ్రీధర్, రత్నం, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్ రహీం, జనార్దనరెడ్డి, భారతి, కల్పన, సుప్రజ, సుధా తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న కిషోర్‌నాయుడు

చిట్టమూరు, ఫిబ్రవరి 7: చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ ఇంటింట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అరవపాళెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, చిన్నారావు, గిరినాయుడు, కస్తూరయ్య, చెంచురామయ్య ఆచారి, మణి, మురళీధర్, ముత్తు, దేవుడు తదితరులు ఉన్నారు.

ఉష్ణోగ్రతలో తేడాతో తెగుళ్లు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7: రాత్రి పూట ఉష్ణోగ్రతలో తేడా వల్ల మామిడి, నిమ్మ, వరి పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మొక్కలపాడు వద్ద ఉన్న మామిడితోటలో తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సలహాలకు ఫోన్ 79950 09767ను సంప్రదించాలని కోరారు.

తెలుగుగంగ నీటిని విడుదల చేయించండి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7: వెంకటగిరి, గూడూరు, సూళ్లురుపేట నియోజకవర్గ రైతుల కోసం తెలుగుగంగ నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, సూళ్లురుపేట ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి తదితరులు సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి స్పందించి తెలుగుగంగ నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారని రాంకుమార్ రెడ్డి తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, ఫిబ్రవరి 7: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం ఏపీవో పూర్ణిమ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనుల గుర్తింపు, కూలీల ఎంపిక ప్రక్రియపై క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి సమీపిస్తుండడంతో పశువులకు తాగునీటి గుంటల పనులు చేయించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు శాంతి, భాస్కర్, పరుశురామ్ పాల్గొన్నారు.